thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

భారత్ అఫ్గాన్ షెడ్యూల్ విడుదల


11

# చురకలు

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 139| జగిత్యాల | శుక్రవారం 21 ఆగస్టు, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## కాంగ్రెస్ ఓ కొత్త 'ముస్లిం లీగ్'



- వందేమాతరాన్ని అవమానించడం దారుణం
- ఓటు బ్యాంకు కోసమే దేశ ఆత్మగౌరవం తాకట్టు
- కాంగ్రెస్ తీరుపై బీజేపీ నేత నితిన్ నబీన్ ఫైర్
- తొలి రెండు చరణాలే పాడాలన్న నిర్ణయంపై ఆగ్రహం

4



## 40 ఏళ్లకే దేశ ప్రధాని!

రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళి

మాజీ ప్రధానిని స్మరించుకున్న నరేంద్ర మోదీ

4

పెంపుడు జంతువులకున్న వసతులు

## బడుల్లో లేవా!

- మహారాష్ట్ర పాఠశాలల్లో అధ్వాన పరిస్థితులు
- విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి
- నాయకుల తీరుపై మండిపడ్డ అభిజీత్ దిప్కే

4



# 22ఏ ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



- కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు
- రైతుల భూ భద్రతకే 'భూ భారతి'
- నేటి నుంచి జిల్లాల వారీగా సమీక్షలు
- అధికారులకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం

### ప్రతి ఫిర్యాదుపై చివరి వరకు పర్యవేక్షణ

22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని, కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును ఒక బాధ్యతగా తీసుకుని సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. 22ఏ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తూ అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్, వాటి పరిష్కారం, వచ్చిన కాల్స్‌కు అందిస్తున్న సమాచారం తదితర అంశాలపై బుధవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి సమీక్షించారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, ఈ నాలుగు జిల్లాల దరఖాస్తుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

- హైదరాబాద్, ఆగస్టు 20 మిగతా 2 లో



## సమస్యలు తేల్చడమే అసలైన సమాఖ్య స్ఫూర్తి

- దక్షిణాది ఎదిగితేనే దేశం పరుగులు
- కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయం చేయాలి
- కాళేశ్వరం, పాలమూరుకు చేయూతనివ్వాలి
- విభజన సమస్యలకు ముగింపు పలకాలి
- 32వ దక్షిణ ప్రాంతీయ మండలి భేటీకి హైదరాబాద్ సిద్ధం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

కేంద్రం, రాష్ట్రాల మధ్య సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే నిజమైన సహకార సమాఖ్యవాదమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రాల మధ్య భిన్న ప్రయోజనాలు ఎదురైనప్పుడు న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా పరిష్కారం కనుగొనడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కలిసి అభివృద్ధి చెందితే దేశాభివృద్ధి మరింత వేగంగా పరుగులు పెడుతుందని పేర్కొన్నారు.

## దక్షిణాది ఒక్కటైతేనే బలం!

- రాష్ట్రాల మధ్య బలమైన సహకారం అవసరం
- ఆర్థిక కూటమిగా దక్షిణాది ఎదగాలి
- నీట్ రద్దుపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలి
- డీలిమిటేషన్‌లో ప్రాతినిధ్యం తగ్గొద్దు

2



## పొంగులేటి భారీ అవినీతి

చర్చకు సవాల్ చేసిన బీజేపీ నేత

మీడియా పాయింట్‌లో మంత్రి కోసం ఎదురుచూపు



.. వివరాలు 3లో

## ఏసీబీ వలలో 'కోట్ల' అధికారి

- శ్రీనివాసరెడ్డి ఇంటిపై ఏకకాలంలో సోదాలు
- రూ.6.87 కోట్ల ఆస్తులు గుర్తించిన ఏసీబీ
- మార్కెట్‌లో భారీ విలువ ఉంటుందని అంచనా
- భూములు.. ప్లాట్లు.. బంగారం.. వాహనాలు
- అక్రమాస్తుల కేసులో అరెస్ట్.. కోర్టుకు తరలింపు

2






## ధాన్యం బకాయిలపై కొరడా!



- 20 మంది రైస్ మిల్లర్ల జాబితా ఈడీకి
- ఆస్తులు.. బ్యాంకు లావాదేవీలపై దర్యాప్తునకు నివేదిక
- హవాలా మార్గంలో నిధుల మళ్లింపుపైనా అనుమానాలు
- తొమ్మిది మంది మిల్లర్లపై పీడీ చట్టానికి రంగం సిద్ధం
- బకాయిల వసూలుకు సివిల్ సప్లయ్స్ శాఖ కఠిన చర్యలు

3



## సుష్మిత వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం

కూతురి మాటలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు?

క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ

3





# ఏసీబీ వలలో 'కోట్ల' అధికారి

## శ్రీనివాసరెడ్డి ఇంటిపై ఏకకాలంలో సోదాలు

## రూ.6.87 కోట్ల ఆస్తులు గుర్తించిన ఏసీబీ

## మార్కెట్‌లో భారీ విలువ ఉంటుందని అంచనా

## భూములు.. ప్లాట్లు.. బంగారం.. వాహనాలు

## అక్రమాస్తుల కేసులో అరెస్ట్.. కోర్టుకు తరలింపు

**హైదరాబాద్, ఆగస్టు 20:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. ఆయన నివాసం, కార్యాలయంతో పాటు పలు ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో భారీగా స్థిర, చరాస్తులను గుర్తించారు. అధికారిక లెక్కల ప్రకారం గుర్తించిన ఆస్తుల విలువ సుమారు రూ.6.87 కోట్లుగా ఉండగా, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ భారీగా ఉంటుందని ఏసీబీ అంచనా వేసింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై ఏసీబీ డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని సంతోషిమాత కాలనీలో ఉన్న శ్రీనివాసరెడ్డి నివాసంతో పాటు కార్యాలయం, ఆయనకు సంబంధించిన ఇతర ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి సోదాలు నిర్వహించారు. ఆస్తులకు సంబంధించిన పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, పెట్టుబడుల వివరాలను అధికారులు పరిశీలించారు. ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం కర్మన్‌ఘాట్‌లో శ్రీనివాసరెడ్డికి రెండు నివాస ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.2.63 కోట్లుగా లెక్కించారు. అదే ప్రాంతంలో రూ.1.61 కోట్ల విలువైన పెంట్‌హౌస్‌ను గుర్తించారు. యాచారం మండలం నల్లవెల్లి గ్రామంలో పది ఎకరాల వ్యవసాయ భూమితో పాటు వివిధ ప్రాంతాల్లో ఎనిమిది ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు సోదాల్లో బయటపడింది. నరేంద్ర బార్ అండ్ రెస్టారెంట్‌లో రూ.86 లక్షల పెట్టుబడి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రూ.4 లక్షల నగదుతో పాటు బ్యాంకు ఖాతాలో రూ.8.60 లక్షల నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

### 680 గ్రాముల బంగారం.. ఏడు వాహనాలు

సోదాల్లో 680 గ్రాముల బంగారు ఆభరణాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నాలుగు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు కలిపి మొత్తం ఏడు వాహనాలను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.59 లక్షలుగా లెక్కించారు. ఇంట్లో మరో రూ.11 లక్షల విలువైన వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలను గుర్తించినట్లు తెలిపారు. బ్యాంకులో 46 తులాల బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం తీసుకున్నట్లు కూడా దర్యాప్తులో బయటపడింది.

### 2009లోనూ అక్రమాస్తుల కేసు!

శ్రీనివాసరెడ్డిపై గతంలోనూ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైనట్లు ఏసీబీ వెల్లడించింది. 2009లో మహేశ్వరం మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో ఆయనపై అక్రమాస్తుల కేసు నమోదైనట్లు తెలిపింది. అనంతరం మహేశ్వరం తహసీల్దార్‌గా కూడా ఆయన పనిచేసినట్లు సమాచారం. తాజా సోదాల్లో లభించిన పత్రాలు, ఆస్తులు, పెట్టుబడులు, బ్యాంకు లావాదేవీలపై ఏసీబీ అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి శ్రీనివాసరెడ్డిని అరెస్ట్ చేసిన అధికారులు, హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.

# 22ఏ ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

- ప్రతి ఫిర్యాదుపై చివరి వరకు పర్యవేక్షణ
- కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు
- రైతుల భూ భద్రతకే 'భూ భారతి'
- నేటి నుంచి జిల్లాల వారీగా సమీక్షలు
- అధికారులకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం

**హైదరాబాద్, ఆగస్టు 20:** భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ శాఖను మరింత ప్రజలకు చేరువ చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును కేవలం దరఖాస్తుగా కాకుండా బాధ్యతగా తీసుకుని సమస్య పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. మరోవైపు రైతుల భూములకు భద్రత కల్పించేందుకే 'భూ భారతి' సర్వే చేపడుతున్నామని వెల్లడించిన మంత్రి.. శుక్రవారం నుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. 22ఏ సమస్యలపై ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులు, వాటి పరిష్కారం, ఎక్కువగా ఏ అంశాలపై ప్రజలు సంప్రదిస్తున్నారనే విషయాలపై పొంగులేటి అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఇప్పటివరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్‌కు వెంటనే పంపించాలని మంత్రి ఆదేశించారు. భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది? దరఖాస్తుదారుడికి అర్హత ఉందా? రికార్డుల్లో వాస్తవ పరిస్థితి ఏమిటి? అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలన్నారు.




### కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు

సమస్య చెప్పిన తర్వాత పరిష్కారం కోసం ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని పొంగులేటి స్పష్టం చేశారు. సబ్‌రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు కొత్తగా వచ్చిన వాటినీ వెంటనే పరిశీలించాలని ఆదేశించారు. ఇకపై దరఖాస్తులు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే వ్యవస్థను రూపొందించాలని సూచించారు. "రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోవద్దు. పరిష్కారం అయ్యే వరకు పర్యవేక్షించాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### రైతుల భూ భద్రతకే 'భూ భారతి'

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం నారాయణపురంలో భూ రీ-సర్వేపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పొంగులేటి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా రైతుల భూములకు భద్రత కల్పించడం, భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే 'భూ భారతి' సర్వే లక్ష్యమని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో భూములు లేకపోయినా బోగస్ పాస్‌పుస్తకాలు సృష్టించి రైతుబంధు నిధులు స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయని ఆరోపించారు. ధరణి వ్యవస్థలో జరిగిన తప్పుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని ఏడు గ్రామాల్లో భూ భారతి సర్వే ప్రారంభమైందని తెలిపారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో సర్వే చేపడుతున్నామని, దశలవారీగా ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు.

### నేటి నుంచి జిల్లాల బాట

ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు భూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు పొంగులేటి జిల్లాల వారీ సమీక్షలు చేపట్టనున్నారు. ఈ సమావేశాలు కేవలం అధికారిక సమీక్షలకే పరిమితం కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కార మార్గాలను నిర్దేశించేలా నిర్వహించనున్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లతో పాటు సంబంధిత శాఖల అధికారులు ఈ సమీక్షల్లో పాల్గొంటారు. స్థానిక ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కూడా భాగస్వాములను చేయనున్నారు. రెవెన్యూ సమస్యలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, స్థల సమస్యలపైనా సమీక్షించనున్నారు. తొలుత శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షను జగిత్యాలలో నిర్వహించనుండగా, శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అంశాలపై నిజామాబాద్‌లో సమీక్ష చేపట్టనున్నారు. మొత్తంగా 22ఏ సమస్యల పరిష్కారం నుంచి భూభారతి సర్వే వరకు రెవెన్యూ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసింది.

# దక్షిణాది ఒక్కటైతేనే బలం!

## రాష్ట్రాల మధ్య బలమైన సహకారం అవసరం

## డ్రగ్స్‌పై ఉమ్మడి పోరు సాగిద్దాం

## ఆర్థిక కూటమిగా దక్షిణాది ఎదగాలి

## నీట్ రద్దుపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలి

## డీలిమిటేషన్‌లో ప్రాతినిధ్యం తగ్గొద్దు

**మహాబలిపురం:** దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణకు అన్ని రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పిలుపునిచ్చారు. రాష్ట్రాల మధ్య బలమైన సహకారం ఏర్పడితేనే ఆర్థికంగా మరింత శక్తిమంతమైన దక్షిణ భారతాన్ని నిర్మించగలమన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉమ్మడి పోరాటం, ఆర్థిక కారిడార్ల నిర్మాణం, సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ విస్తరణతో పాటు నదీ జలాలు, నీట్, డీలిమిటేషన్ వంటి కీలక అంశాల్లో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుకునేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణాది ప్రాంతీయ మండలి సమావేశంలో విజయ్ ప్రసంగించారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో 30 శాతానికి పైగా వాటా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు తయారీ, ఎగుమతులు, సేవల రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని గుర్తుచేశారు. ఈ ఆర్థిక బలాన్ని మరింత పెంచుకునేందుకు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అత్యవసరమన్నారు. తయారీ కేంద్రాలు, సరకు రవాణా పార్కులు, ప్రత్యేక రవాణా మార్గాల నిర్మాణం ద్వారా దక్షిణాది ప్రాంతాన్ని సమీకృత ఆర్థిక కూటమిగా తీర్చిదిద్దాలని విజయ్ ఆకాంక్షించారు. బెంగళూరులోని బొమ్మసంద్ర నుంచి హోసూరు వరకు మెట్రో రైలు విస్తరణ అంతర్రాష్ట్ర సహకారానికి మంచి నమూనా అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు సంబంధిత రాష్ట్రాలు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. 'డ్రగ్స్ రహిత దక్షిణ భారతం' లక్ష్యంగా అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేయాలని విజయ్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన నిఘా సమాచారాన్ని రాష్ట్రాలు ఎప్పటికప్పుడు పంచుకోవాలని, డ్రగ్స్ ముఠాలపై ఉమ్మడిగా ఉక్కుపాదం మోపాలని సూచించారు. ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలు, అనధికార పంపిణీపైనా కఠిన నిఘా అవసరమన్నారు. దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధిలో సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని విజయ్ సూచించారు. 1,076 కిలోమీటర్ల తీరప్రాంతం కలిగిన తమిళనాడు.. ఓడరేవులు, తీరప్రాంత నౌకాయానం, మత్స్య పరిశ్రమ, సముద్ర ఆధారిత పరిశ్రమలు, పర్యాటక రంగాల్లో ఇతర రాష్ట్రాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాబోయే ఆర్థిక సంఘం నిధుల కేటాయింపులో రాష్ట్రాల అవసరాలతో పాటు వాటి పనితీరునూ పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన రాష్ట్రాలకు నష్టం జరగకూడదన్నారు. వస్తు సేవల పన్ను అమలు తర్వాత రాష్ట్రాలు కోల్పోయిన ఆర్థిక స్వేచ్ఛపైనా పునరాలోచన అవసరమని అభిప్రాయపడ్డారు. నీట్ పరీక్షపై తమిళనాడు వ్యతిరేకతను విజయ్ మరోసారి స్పష్టం చేశారు. ఈ విధానం గ్రామీణ, పేద విద్యార్థులకు నష్టం కలిగిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర కోటాలోని



వైద్య, దంత, ఆయుష్ సీట్లను 12వ తరగతి మార్కుల ఆధారంగా భర్తీ చేసుకునే అవకాశం తమిళనాడుకు కల్పించాలని కేంద్రాన్ని కోరారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన కారణంగా దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంటులో ప్రాతినిధ్యం కోల్పోయే పరిస్థితి రాకూడదని విజయ్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియలో ఏ రాష్ట్రానికీ ప్రస్తుతం ఉన్న ప్రాతినిధ్యం తగ్గదనే చట్టపరమైన హామీని కేంద్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల్లో న్యాయస్థానాల తీర్పులు, ట్రైబ్యునళ్ల అవార్డులను తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. కావేరీ జలాల విషయంలో ఆదేశాలను సకాలంలో అమలు చేయడంతో పాటు ముల్లపెరియార్ ఆనకట్ట భద్రత, నీటి నిల్వను 152 అడుగులకు పెంచే అంశంలో న్యాయస్థానాల నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. "బలమైన రాష్ట్రాలతోనే బలమైన దేశం సాధ్యం. విభేదాలను చర్చలు, పరస్పర గౌరవం, చట్టపాలనతో పరిష్కరించుకునేందుకు తమిళనాడు సిద్ధంగా ఉంది" అని విజయ్ స్పష్టం చేశారు.

# సమస్యలు తేల్చడమే అసలైన సమాఖ్య స్ఫూర్తి

## దక్షిణాది ఎదిగితేనే దేశం పరుగులు

## కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయం చేయాలి

## కాళేశ్వరం, పాలమూరు పథకాలకు కేంద్రం చేయూతనివ్వాలి

## విభజన సమస్యలకు ఇకనైనా ముగింపు పలకాలి

## 32వ దక్షిణ ప్రాంతీయ మండలి భేటీకి హైదరాబాద్ సిద్ధం

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**మహాబలిపురం, ఆగస్టు 20:** కేంద్రం, రాష్ట్రాల మధ్య సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే నిజమైన సహకార సమాఖ్యవాదమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రాల మధ్య భిన్న ప్రయోజనాలు ఎదురైనప్పుడు న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా పరిష్కారం కనుగొనడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కలిసి అభివృద్ధి చెందితే దేశాభివృద్ధి మరింత వేగంగా పరుగులు పెడుతుందని పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో తెలంగాణ తరఫున భట్టి విక్రమార్క పలు కీలక అంశాలను ప్రస్తావించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ఆర్థిక సహాయం, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని పెండింగ్ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై తెలంగాణ వైఖరిని స్పష్టం చేశారు. మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ఉదాహరణగా ప్రస్తావించిన భట్టి.. బలమైన నిర్మాణంలో ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, కానీ ప్రతి భాగం తన



వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, సమర్థంగా సమన్వయం చేయగల వ్యవస్థలే నిజమైన సమాఖ్యవాదానికి నిదర్శనమన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభను ఆకర్షించడంలో రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనన్నారు. అయితే నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్రాల సరిహద్దులు అడ్డుకావని గుర్తుచేశారు. సమస్యలు కూడా రాష్ట్ర సరిహద్దులను ప్రభుత్వ ఫైళ్ల కంటే వేగంగా దాటుతాయని చమత్కరించారు. అందుకే దక్షిణ ప్రాంతీయ మండలి వంటి వేదికల ప్రాధాన్యం మరింత పెరిగిందన్నారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ వైఖరి స్పష్టంగా ఉందని భట్టి పేర్కొన్నారు. ఇప్పటికే ఏర్పాటైన చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను కోరుతున్నామని తెలిపారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలు వర్తింపజేయాలని కోరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ట్రిబ్యునల్ పరిధిలో ఉన్నందున చట్టపరమైన ప్రక్రియ ద్వారా వీలైనంత త్వరగా పరిష్కారం రావాలని ఆకాంక్షించారు. మిగులు జలాలపై దిగువ రాష్ట్రంగా తెలంగాణకు ఉన్న హక్కులను కాపాడాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని స్పష్టం చేశారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని భట్టి కోరారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు ముందుకు సాగుతున్నాయని వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం సహకరించాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులు కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశాలుగా కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మార్చే అభివృద్ధి ప్రాజెక్టులుగా చూడాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లో ఉండటాన్ని భట్టి ప్రస్తావించారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా వాటికి తుది పరిష్కారం చూపాల్సిన సమయం వచ్చిందన్నారు. "పరిష్కారం అంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు కాదు. ప్రతి కొన్నేళ్లకు కొత్త అర్థాలు, కొత్త వివరణలు ఇవ్వడం కాదు. పెండింగ్ అంశాలు ఇక తుది నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు దిశగా సాగాలి" అని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజనకు సంబంధించి 23 సంస్థలపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్ర హోంశాఖకు సమర్పించిందన్నారు. సమస్యల పరిష్కారానికి తెలంగాణ సిద్ధంగా ఉన్నప్పటికీ, అది పునర్వ్యవస్థీకరణ చట్టం పరిధిలోనే జరగాలని తేల్చిచెప్పారు. నీటి భద్రత, ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, పట్టణీకరణ, రవాణా, సరకు రవాణా వ్యవస్థలు, ఆర్థిక పోటీతత్వం రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలకు కీలక సవాళ్లుగా మారనున్నాయని భట్టి పేర్కొన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు ఒకవైపు పోటీ పడుతూనే మరోవైపు పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "దక్షిణ భారతదేశం కలిసి అభివృద్ధి చెందితే.. భారతదేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది" అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని భట్టి ప్రకటించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమస్యలకు చర్చల ద్వారానే శాశ్వత పరిష్కారాలు రావాలని ఆకాంక్షించారు. సమస్యల పరిష్కారానికి మరో ట్రిబ్యునల్, మరో కమిటీ, మరోసారి ఉత్తర ప్రత్యుత్తరాలు అవసరం లేని స్థాయిలో నిర్ణయాలు జరగాలని కోరారు. తదుపరి సమావేశానికి వచ్చే అన్ని రాష్ట్రాల ప్రతినిధులకు తెలంగాణ ఆత్మీయ ఆతిథ్యం అందిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు.

# ధాన్యం బకాయిలపై కొరడా!

## 20 మంది రైస్ మిల్లర్ల జాబితా ఈడీకి

- ఆస్తులు.. బ్యాంకు లావాదేవీలపై దర్యాప్తునకు నివేదిక
- హవాలా మార్గంలో నిధుల మళ్లింపుపైనా అనుమానాలు
- తొమ్మిది మంది మిల్లర్లపై పీడీ చట్టానికి రంగం సిద్ధం
- బకాయిల వసూలుకు సివిల్ సప్లయ్స్ శాఖ కఠిన చర్యలు



**హైదరాబాద్, ఆగస్టు 20:** ప్రభుత్వ ధాన్యం బకాయిలను భారీగా ఎగవేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్ మిల్లర్లపై తెలంగాణ ప్రభుత్వం కొరడా ఝుళిపించేందుకు సిద్ధమవుతోంది. ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో బకాయిపడిన 20 మంది రైస్ మిల్లర్ల వివరాలను సివిల్ సప్లయ్స్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు అందజేసినట్లు సమాచారం. ధాన్యం లావాదేవీలతో పాటు మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం తీసుకున్న కొందరు మిల్లర్లు నిబంధనల ప్రకారం తిరిగి చెల్లించాల్సిన బియ్యం లేదా అందుకు సంబంధించిన బకాయిలను చెల్లించకుండా భారీగా పెండింగ్‌లో పెట్టినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. పలుమార్లు నోటీసులు ఇచ్చినా కొందరి నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో ప్రభుత్వం కఠిన చర్యల దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

### ఆర్థిక లావాదేవీలపై ఈడీ నజర్

ధాన్యం వ్యవహారాల్లో అక్రమ మార్గాల్లో నిధులు సమీకరించారా? ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్మును ఇతర వ్యాపారాలకు మళ్లించారా? హవాలా మార్గంలో ఆర్థిక లావాదేవీలు జరిగాయా? అనే అనుమానాలపైనా విచారణ జరపాలని ఈడీకి అందించిన నివేదికలో కోరినట్లు సమాచారం. సంబంధిత మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, ధాన్యం కొనుగోళ్లు, మిల్లింగ్ రికార్డులను పరిశీలిస్తే అసలు వ్యవహారం వెలుగులోకి వస్తుందని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### తొమ్మిది మందిపై పీడీ చట్టం!

మరోవైపు ప్రభుత్వ బకాయిల విషయంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న తొమ్మిది మంది రైస్ మిల్లర్లపై పీడీ చట్టం ప్రయోగించే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. పలుమార్లు నోటీసులు ఇచ్చినా బకాయిలు చెల్లించకపోవడం, భారీ మొత్తాలను పెండింగ్‌లో ఉంచడం, ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ దిశగా చర్యలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ధాన్యం విషయంలో నిర్లక్ష్యం, అక్రమాలకు తావులేకుండా బకాయిలను పూర్తిస్థాయిలో రాబట్టాలన్న లక్ష్యంతో సివిల్ సప్లయ్స్ శాఖ చర్యలను ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం. ఈడీ విచారణ మొదలైతే మిల్లర్ల ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల వ్యవహారాల్లో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# సుష్మిత వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం

## కూతురి మాటలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు?

### ఆమె అభిప్రాయాలతో నాకు సంబంధం లేదు • పార్టీ క్రమశిక్షణపై పూర్తి గౌరవం ఉంది

### నోటీసును వెనక్కి తీసుకోవాలి • క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ



**హైదరాబాద్, ఆగస్టు 20:** తన కుమార్తె సుష్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని, వాటికి తనను బాధ్యురాలిని చేయడం సమంజసం కాదని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంటూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి గురువారం లేఖ రాశారు. తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు. సుష్మిత తన కుమార్తె అయినంత మాత్రాన ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు తాను రాజకీయంగా బాధ్యత వహించాలనడం సముచితం కాదని సురేఖ పేర్కొన్నారు. ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్యలకు కుటుంబ సభ్యులను బాధ్యులను చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. తన ప్రమేయం లేని అంశంలో వివరణ కోరడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని సురేఖ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సుష్మిత వ్యాఖ్యల విషయంలో తనకు ఎలాంటి ప్రమేయం లేదన్న విషయాన్ని గుర్తించాలని క్రమశిక్షణ కమిటీని కోరారు. ఈ నేపథ్యంలో తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### సుష్మిత వ్యాఖ్యలతో రచ్చ

వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం నిర్వహించిన కొండా సురేఖ జన్మదిన వేడుకలకు సుష్మితా పటేల్ హాజరై చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో రాజకీయ దుమారం రేపాయి. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి పోటీ చేస్తానని, కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని పలు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సుష్మిత వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ దీనిపై నివేదిక కోరగా, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి కూడా స్పందించారు. కొండా సురేఖ నుంచి వివరణ కోరతామని ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే సురేఖ క్రమశిక్షణ కమిటీకి లేఖ రాస్తూ.. "సుష్మిత మాటలు ఆమె వ్యక్తిగతం.. వాటికి నన్ను బాధ్యురాలిని చేయొద్దు" అని స్పష్టం చేశారు.

# 22ఏపై రాహుల్‌కు హరీశ్ లేఖ

### తెలంగాణలో సెక్షన్ దుర్వినియోగమంటూ ఆరోపణ

### వేలాది ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టారని విమర్శ

### రెవెన్యూలో 30 శాతం వసూళ్ల దందా అంటూ ధ్వజం

### పొంగులేటిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్

### స్వతంత్ర విచారణకు ఆదేశించాలని రేవంత్ సర్కారుకు సవాల్



**హైదరాబాద్, ఆగస్టు 20:** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారంపై బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. 22ఏ సెక్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించిన ఆయన.. ఈ వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌తో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో వేలాది ప్రైవేటు ఆస్తులను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి యజమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. సంబంధిత అనుమతులు ఉన్న ఆస్తులను కూడా నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో '30 శాతం వసూళ్ల దందా' సాగుతోందని హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. నిషేధిత జాబితా నుంచి ఆస్తులను తొలగించేందుకు దళారులు 30 శాతం కమీషన్ డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం మౌనం వీడాలని డిమాండ్ చేశారు. 22ఏ వ్యవహారంపై స్వతంత్ర విచారణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఆదేశించాలని హరీశ్‌రావు కోరారు. ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని రాహుల్ గాంధీకి రాసిన లేఖలో హరీశ్‌రావు స్పష్టం చేశారు.



## బావిలోకి దూసుకెళ్లిన కారు..

# కుటుంబం బలి

### అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం.. భార్యాభర్తలు.. ఇద్దరు చిన్నారుల మృతి

### సిద్దిపేట నుంచి స్వగ్రామానికి వస్తుండగా విషాదం

**సిద్దిపేట, ఆగస్టు 20:** సిద్దిపేట జిల్లాలో అర్ధరాత్రి ఘోర విషాదం చోటుచేసుకుంది. అదుపుతప్పిన కారు రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో భార్యాభర్తలతో పాటు నాలుగేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. దుబ్బాక మండలం బలవంతాపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (30), అతని భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్ష్ (4), కుమార్తె శాన్విక (2)తో కలిసి సిద్దిపేట నుంచి కారులో స్వగ్రామానికి బయలుదేరారు. బుధవారం అర్ధరాత్రి అప్పనపల్లి శివారుకు చేరుకున్న సమయంలో కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీ సహాయంతో బావిలో పడిపోయిన కారును బయటకు తీశారు. కారులో ఉన్న రాజు, భాగ్య, నిహాన్ష్, శాన్విక మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబంలో భార్యాభర్తలు, ఇద్దరు చిన్నారులు ఒకేసారి మృత్యువాత పడటంతో బలవంతాపూర్‌తో పాటు అప్పనపల్లి ప్రాంతంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.




# మంత్రి పొంగులేటి భారీ అవినీతి

### చర్చకు సవాల్ చేసిన బీజేపీ నేత

### మీడియా పాయింట్‌లో మంత్రి కోసం ఎదురుచూపు

**హైదరాబాద్, ఆగస్టు 20:** రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. మంత్రి భారీ అవినీతికి పాల్పడ్డారని, అందుకు సంబంధించిన ఆధారాలన్నీ తన వద్ద ఉన్నాయని ప్రకటించారు. తన ఆరోపణలపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరిన ఏలేటి.. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌కు చేరుకుని మంత్రి కోసం ఎదురుచూడటం రాజకీయంగా చర్చనీయాంశమైంది. పొంగులేటిపై తాను చేస్తున్న ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని ఏలేటి స్పష్టం చేశారు. అవినీతిపై చర్చకు సిద్ధమైతే అసెంబ్లీ మీడియా పాయింట్‌కు రావాలని బుధవారమే సవాల్ చేసిన ఆయన.. గురువారం స్వయంగా అక్కడికి చేరుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు అక్కడే ఉంటానని, మంత్రి వచ్చి తన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డెడ్‌లైన్ విధించారు. భూభారతి, 22ఏ వ్యవహారాల్లో భారీ అక్రమాలు జరిగాయని ఏలేటి ఆరోపించారు. ఫీనిక్స్, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థలకు సంబంధించిన భూ బదలాయింపులపైనా ఆయన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ, ప్రజల భూములను లాక్కున్నారని విమర్శించారు. ఈ వ్యవహారాలపై సీబీఐ విచారణ జరిపించాలని, నిజానిజాలను తేల్చేందుకు హౌస్ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తన వద్ద ఉన్న ఆధారాలతో చర్చకు సిద్ధంగా ఉన్నానని, మంత్రి పొంగులేటి వచ్చి వివరణ ఇచ్చే వరకు కదిలేది లేదని ఏలేటి తేల్చిచెప్పారు. తన ఆరోపణలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెబుతారా? లేక మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరణ ఇస్తారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ప్రభుత్వం తరఫున ఎవరొచ్చినా తన వద్ద ఉన్న ఆధారాలను అందజేస్తానని ప్రకటించారు. అయితే ఏలేటి చేసిన ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందన వెలువడాల్సి ఉంది. దీంతో ఆధారాలు బయటపెడతానన్న ఏలేటి సవాల్‌కు మంత్రి ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## ఎర్రబెల్లి కాలువ బాటతో ఉద్రిక్తత

### అడ్డుకుని దేవరుప్పలకు తరలించిన పోలీసులు



**జనగామ, ఆగస్ట్ 20:** మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కాలువ బాట కార్యక్రమంతో జనగామ జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని దేవరుప్పుల, కొడకండ్ల మండలకు సాగు నీరు విడుదల చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేపట్టిన కాలువ బాటను సింగరాజుపల్లి గ్రామంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తల ధర్నా చేపట్టారు. తీవ్ర ఉద్రిక్తత నడుమ ధర్నా చేస్తున్న ఎర్రబెల్లిని అరెస్ట్ చేసి దేవరుప్పుల పోలీస్ స్టేషన్ కి తరలించారు. శాంతియుతంగా నిరసన చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యంపై బీఆర్ఎస్ తరఫున ఉద్యమిస్తామన్నారు. ఎర్రబెల్లిని భేషరతుగా విడుదల చేయాలని ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాగా తోపులాటలో ఎర్రబెల్లికి నుదుటికి స్వల్పంగా గాయం కావడంతో పోలీసులు దవాఖానకు తరలించి చికిత్స చేయించారు.

## సిక్కు వ్యతిరేక అల్లర్ల నిందితుడు

### జైలులోనే సజ్జన్ కుమార్ మృతి

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20:** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ (80) కన్నుమూశారు. ఢిల్లీలోని తీహార్ జైల్‌లో ఉన్న ఆయనను గురువారం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు తెలిపారు. సజ్జన్ మృతికి గల కారణాలు ఆసుపత్రి వర్గాలు ఇంకా వెల్లడించాల్సి ఉంది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1984లో సిక్కు మతస్థులైన తన బాడీ గార్డుల చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ తరువాత ఢిల్లీ సహా ఉత్తరాదిన పలు ప్రాంతాల్లో సిక్కులపై భారీ స్థాయిలో మూక దాడులు జరిగాయి. ఇందుకు సంబంధించి కొన్ని కేసుల్లో సజ్జన్ కుమార్ దోషిగా తేలారు. ఈ దాడుల్లో సిక్కుల వ్యాపారాలు, నివాససముదాయాలపై దాడులు జరిగాయి. అనేక మంది కన్నుమూశారు. అధికారిక గణాంకాల ప్రకారం, నాటి దాడుల్లో 3 వేల పైచిలుకు మంది కన్నుమూశారు. పలామ్ కాలనీ ఏరియాలో జరిగిన ఐదుగురి హత్య ఉదంతంలో ఢిల్లీ హైకోర్టు సజ్జన్ కుమార్‌ను 2018లో దోషిగా తేల్చింది. యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఆ తరువాత ఢిల్లీ సారస్వత్ నగర్‌లో ఇద్దరు సిక్కుల హత్య కేసులో ఢిల్లీ హైకోర్టు 2025లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అయితే, ఢిల్లీలోని జనక్‌పురి, వికాస్‌పురి ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనల కేసులో మాత్రం సజ్జన్ పాత్రను నిరూపించే ఆధారాలు లేకపోవడంతో కోర్టులో విముక్తి లభించింది. జాట్ వర్గం కీలక నేత సజ్జన్ కుమార్ 1980ల్లో ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. 1977లో స్థానిక కౌన్సిలర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన ఆ తరువాత ఔటర్ ఢిల్లీ నియోజకర్గం నుంచి మూడు సార్లు ఎంపీగా గెలిచారు.

## సంపాదకీయం



# ధరల పెరుగుదలను కంట్రోల్ చేసేదెవరు?

దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడికి పెనుభారంగా మారుతున్నాయి. బియ్యం నుంచి పప్పుల వరకు, వంటనూనెల నుంచి కూరగాయల వరకు, చివరకు మందుల ధరలు కూడా పెరుగుతున్నాయి. కుటుంబ ఆదాయం అదే స్థాయిలో ఉండగా ఖర్చులు మాత్రం అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ధరలను అదుపు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ఎజెండాల్లో మునిగిపోతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు ధరల పెరుగుదలను నియంత్రించేదెవరు? సామాన్యుడి జేబుకు పడుతున్న చిల్లును పూడ్చేదెవరు? అన్న ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో బియ్యం ధరల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. సన్నబియ్యం కిలో ధర రూ.80 వరకు పలుకుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఇది మరింత పెరిగి రూ.100కు చేరుతుందన్న ప్రచారం వినియోగదారులను కలవరపెడుతోంది. వాతావరణ పరిస్థితులు, ఉత్పత్తి తగ్గుదల, రవాణా ఖర్చులు వంటి కారణాలు చెబుతున్నా.. మార్కెట్లో ధరలు ఒక్కసారిగా ఎందుకు పెరుగుతున్నాయి? నిల్వలు ఎంత ఉన్నాయి? కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అన్న అంశాలపై ప్రభుత్వాలు నిరంతర పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. బియ్యంతోనే సమస్య ముగియడం లేదు. పప్పులు, వంటనూనెలు, ఉప్పు సహా నిత్యావసరాల ధరలు కుటుంబ బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. కూరగాయల్లో చాలా రకాలు కిలో రూ.60 నుంచి రూ.100 వరకు పలుకుతున్న సందర్భాలు ఉన్నాయి. మందుల ధరలు కూడా పెరుగుతుండటం మధ్యతరగతి, పేద కుటుంబాలకు మరో భారంగా మారుతోంది. ఆహారం, వైద్యం వంటి కనీస అవసరాలే భారంగా మారితే అభివృద్ధి గణాంకాలు సామాన్యుడికి ఎంతవరకు ఊరటనిస్తాయన్నది పాలకులు ఆలోచించాలి.

### రాజకీయాల హోరులో ధరల గోడు

తెలుగు రాష్ట్రాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పర విమర్శలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి, వైకాపా మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. తెలంగాణలో 22ఏ భూముల వివాదం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ యుద్ధానికి దారితీసింది. భూములు, కమిషన్లు, ప్రభుత్వ వైఫల్యాలపై పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. జాతీయస్థాయిలోనూ అధికార, ప్రతిపక్షాలు తమ రాజకీయ అంశాల చుట్టూనే చర్చను నడిపిస్తున్నాయి. రాజకీయ పార్టీలు తమ సంస్థాగత వ్యవహారాలు, ఎన్నికల వ్యూహాలు, ప్రత్యర్థులపై విమర్శలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నాయో.. ప్రజల రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తున్న ధరల సమస్యకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్నికల సమయంలో ప్రజల ఇంటి బడ్జెట్, ఉపాధి, సంక్షేమం గురించి మాట్లాడే పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే శ్రద్ధ చూపాలి.

### గణాంకాలు కాదు.. ఉపశమనం కావాలి

పన్నుల వసూళ్లు పెరిగాయని, ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తోందని చెప్పుకోవడం మాత్రమే సరిపోదు. మార్కెట్‌కు వెళ్లిన సామాన్యుడు తన సంపాదనతో అవసరమైన సరుకులు కొనగలుగుతున్నాడా లేదా అన్నదీ ఆర్థిక ప్రగతికి ముఖ్యమైన కొలమానమే. కిలో బియ్యం కొనడానికి కూడా ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి వస్తే ఆర్థికాభివృద్ధి ఫలాలు కిందిస్థాయి ప్రజలకు చేరుతున్నాయా అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

### మార్కెట్‌ను వ్యాపారుల ఇష్టానికి వదలొద్దు

ధరల నియంత్రణ అంటే వ్యాపారులపై దాడులు చేయడం మాత్రమే కాదు. ఉత్పత్తి నుంచి వినియోగదారుడి వరకు సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేయాలి. ఎక్కడ కొరత ఏర్పడుతోంది, ఎక్కడ అనవసరంగా నిల్వ చేస్తున్నారు, మధ్యవర్తుల వల్ల ధర ఎంత పెరుగుతోంది, రైతుకు లభిస్తున్న ధరకు వినియోగదారుడు చెల్లిస్తున్న ధరకు మధ్య ఎంత వ్యత్యాసం ఉందన్నది ప్రభుత్వాలు పరిశీలించాలి. అవసరమైనప్పుడు నిల్వలను మార్కెట్లోకి విడుదల చేయడం, కృత్రిమ కొరతను అడ్డుకోవడం, రైతుబజార్లు, సహకార విక్రయ కేంద్రాలను బలోపేతం చేయడం వంటి చర్యలు చేపట్టాలి. ధరల పెరుగుదల కేంద్రానిదా, రాష్ట్రానిదా అని బాధ్యతను ఒకరిపై మరొకరు నెట్టుకోవడం వల్ల సామాన్యుడికి ప్రయోజనం ఉండదు. కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలి. నిత్యావసరాల ధరలపై నిరంతర సమీక్షకు ప్రత్యేక వ్యవస్థ ఉండాలి. అవసరమైన వస్తువుల నిల్వలు, సరఫరా, ధరల వివరాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలి.

**ఎన్నికల్లో గెలవడం రాజకీయ పార్టీల లక్ష్యం కావచ్చు. కానీ అధికారంలోకి వచ్చాక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే పాలనకు అసలు పరీక్ష. అన్నం, పప్పు, నూనె, కూరగాయలు, మందులు సామాన్యుడికి అందుబాటు ధరల్లో లభించేలా చూడడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. ఇప్పటికైనా రాజకీయ విమర్శల నుంచి కొంత సమయాన్ని ప్రజల వంటింటి వైపు మళ్లించాలి. లేదంటే మార్కెట్ వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారి.. 'ధరలను కంట్రోల్ చేసేదెవరు?' అన్న ప్రశ్న మరింత బలంగా వినిపించడం ఖాయం.**

# రాజీవ్‌కు ఘన నివాళి







- వీర్‌భూమి వద్ద కాంగ్రెస్ అగ్రనేతల అంజలి
- సోనియా, రాహుల్, ఖర్గే, ప్రియాంక నివాళి
- ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ సేవలు చిరస్మరణీయమన్న కాంగ్రెస్
- సామాజిక మాధ్యమం వేదికగా మాజీ ప్రధానిని స్మరించుకున్న మోదీ
- దేశవ్యాప్తంగా సద్భావనా దివస్ కార్యక్రమాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని రాజీవ్ గాంధీ స్మారక స్థలం వీర్‌భూమిని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ తదితరులు సందర్శించి పుష్పాంజలి ఘటించారు. రాజీవ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ పోషించిన పాత్ర చిరస్మరణీయమని కాంగ్రెస్ పేర్కొంది. దేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించడంలో, యువతకు అవకాశాలు కల్పించడంలో ఆయన చూపిన దార్శనికతను గుర్తుచేసుకుంది. వీర్‌భూమి వద్ద నివాళుల కార్యక్రమానికి సంబంధించిన దృశ్యాలను కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ గాంధీ జయంతిని నిర్వహించాయి. వివిధ ప్రాంతాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నాయి.

### రాజీవ్‌ను స్మరించుకున్న మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నట్లు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని ఏటా సద్భావనా దివస్‌గా నిర్వహిస్తారు. జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించడం దీని ప్రధాన ఉద్దేశం. కుల, మత, జాతి భేదాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు ఆధునిక, సమ్మిళిత భారత నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయాలన్న రాజీవ్ దార్శనికతను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటారు. ఇందిరాగాంధీ హత్య అనంతరం 1984లో రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారు. కేవలం 40 ఏళ్ల వయసులో దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి భారత రాజకీయ చరిత్రలో అత్యంత పిన్న వయసులో ప్రధానమంత్రి అయిన నేతగా నిలిచారు.

# వందేమాతరంపై రాజకీయ రగడ

- రెండు చరణాలకే కాంగ్రెస్ మొగ్గు
- కాంగ్రెస్ తీరుపై బీజేపీ ఆగ్రహం
- 'కొత్త ముస్లిం లీగ్' అంటూ నితిన్ ధ్వజం
- ఓటు బ్యాంకు రాజకీయాలంటూ విమర్శలు
- దేశభక్తిపై ప్రశ్నించిన సుధాంశు త్రివేది





**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** జాతీయ గేయం 'వందే మాతరం'పై కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం మరింత ముదిరింది. పార్టీ కార్యక్రమాల్లో వందే మాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న 1937 నాటి నిర్ణయానికే కట్టుబడి ఉండాలని కాంగ్రెస్ నిర్ణయించగా, బీజేపీ తీవ్రంగా మండిపడింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ దేశ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ బుధవారం సమావేశమై వందే మాతరం ఆలాపన విషయంలో 1937 నాటి పార్టీ తీర్మానాన్ని అనుసరించాలని నిర్ణయించింది. ఇకపై పార్టీ కార్యక్రమాల్లో తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని స్పష్టం చేసింది. ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందే మాతరం పూర్తి రూపాన్ని ఆలపించే విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

### 'కొత్త ముస్లిం లీగ్'గా కాంగ్రెస్

కాంగ్రెస్ నిర్ణయంపై నితిన్ నబీన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ 'కొత్త ముస్లిం లీగ్'గా మారిందని ఆరోపించారు. వందే మాతరాన్ని అవమానించడం అంటే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను అవమానించడమేనని వ్యాఖ్యానించారు. ఓటు బ్యాంకు కోసం దేశ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ పదేపదే తాకట్టు పెడుతోందని విమర్శించారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది కూడా కాంగ్రెస్‌పై మండిపడ్డారు. స్వాతంత్ర్య ఉద్యమానికి తామే వారసులమని చెప్పుకొనే కాంగ్రెస్ జాతీయ గేయాన్ని పూర్తిగా గౌరవించేందుకు ఎందుకు సిద్ధంగా లేదని ప్రశ్నించారు. వందే మాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరి ఆ పార్టీ దేశభక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని ఆరోపించారు.

### చరిత్రను తెరపైకి తెచ్చిన బీజేపీ

వందే మాతరంపై గతంలో ముస్లిం లీగ్ వ్యక్తం చేసిన అభ్యంతరాలను కూడా బీజేపీ నేతలు ప్రస్తావించారు. అప్పటి వైఖరికి, ప్రస్తుతం కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయానికి పోలికలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ మాత్రం 1937లో తీసుకున్న నిర్ణయాన్నే కొనసాగిస్తున్నామని స్పష్టం చేస్తోంది. దీంతో వందే మాతరం ఆలాపన అంశం మరోసారి జాతీయస్థాయిలో రాజకీయ చర్చకు కేంద్రబిందువైంది.

# పాకిస్థాన్ యాక్షన్.. భారత్ రియాక్షన్!

### ఢిల్లీలో పాక్ హైకమిషన్ వద్ద బారికేడ్ల తొలగింపు
### ట్రాఫిక్ బొల్లార్డ్స్, క్యూలైన్లపైనా వేటు
### ఇస్లామాబాద్ చర్యకు మూడు రోజుల్లోనే ఢిల్లీ బదులు
### 'దెబ్బకు దెబ్బ' చర్యగా దౌత్యవర్గాల్లో చర్చ
### కశ్మీర్‌పై అమెరికా రాయబారి వ్యాఖ్యలతో పాక్ గుర్రు

**న్యూఢిల్లీ:** భారత్–పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న దౌత్య ఉద్రిక్తతల నడుమ మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ వెలుపల పాకిస్థాన్ అధికారులు చేపట్టిన చర్యలకు మూడు రోజుల వ్యవధిలోనే ఢిల్లీలో ప్రతిచర్య కనిపించింది. న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్లు, ట్రాఫిక్ బొల్లార్డ్స్, క్యూలైన్ ఏర్పాట్లను భారత అధికారులు తొలగించారు. పాకిస్థాన్ హైకమిషన్ వెలుపల అనుమతించిన పరిధిని దాటి కొన్ని ఏర్పాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో వీసా విభాగం సమీపంలోని క్యూలైన్లు, బారికేడ్లు సహా ఇతర ఏర్పాట్లను జేసీబీ సాయంతో తొలగించారు. ఇస్లామాబాద్‌లో భారత హైకమిషన్ వెలుపల పాకిస్థాన్ అధికారులు ఇదే తరహా చర్యలు చేపట్టిన కొద్ది రోజులకే ఢిల్లీలో ఈ పరిణామం చోటుచేసుకోవడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఇస్లామాబాద్‌లో భారత హైకమిషన్ వద్ద భద్రతా ఏర్పాట్లను తొలగించిన ఘటనకు ప్రతిచర్యగానే ఢిల్లీలో తాజా చర్యలు చేపట్టారన్న చర్చ సాగుతోంది. 'దెబ్బకు దెబ్బ' అన్న తరహాలో భారత్ స్పందించిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పాకిస్థాన్ చర్యకు ప్రతీకారంగానే బారికేడ్లు తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు. ఇరుదేశాలు పరస్పరం దౌత్య కార్యాలయాల వద్ద ఏర్పాట్లను తొలగించుకోవడం మాత్రం కొత్త చర్చకు తెరలేపింది.

### కశ్మీర్ వ్యాఖ్యలతో పాక్‌కు మరో మంట

మరోవైపు జమ్మూకశ్మీర్‌పై అమెరికా రాయబారి సెర్జియో గోర్ చేసిన వ్యాఖ్యలు పాకిస్థాన్‌కు ఆగ్రహం తెప్పించాయి. జమ్మూకశ్మీర్ భారత్‌లో ముఖ్యమైన భాగమని పేర్కొన్న ఆయన, కశ్మీర్ లోయలో భద్రతా పరిస్థితులు మెరుగుపడ్డాయని వ్యాఖ్యానించారు. అమెరికా ప్రయాణ హెచ్చరికలను పునఃపరిశీలించే అవకాశముందని కూడా సంకేతాలిచ్చారు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన పాకిస్థాన్.. ఇస్లామాబాద్‌లోని అమెరికా ఛార్జ్ డి'అఫైర్స్ నాటలీ బేకర్‌ను విదేశాంగ శాఖకు పిలిపించి నిరసన తెలిపింది. జమ్మూకశ్మీర్ అంశంపై తమ వైఖరిని మరోసారి వెల్లడించింది. దీంతో భారత్–పాక్ దౌత్య ఉద్రిక్తతలకు కశ్మీర్ అంశం కూడా తోడై పరిస్థితి మరింత ఆసక్తికరంగా మారింది.

# విద్యార్థుల కంటే మంత్రి కుక్కలకే మెరుగైన సౌకర్యాలు!

### సర్కారు బడుల దుస్థితిపై అభిజిత్ దీప్కే ఆగ్రహం
### విద్యాశాఖ మంత్రి దాదా భుసే రాజీనామాకు డిమాండ్
### 'ధర్మం కాదు.. పిల్లల భవిష్యత్తే ప్రమాదంలో'
### బడులు బాగుచేయకుంటే నేతలను ఊళ్లలోకి రానివ్వొద్దని పిలుపు
### 2029 ఎన్నికల్లో జెన్ జీ కీలక శక్తిగా మారుతుందని హెచ్చరిక

**లాతూర్, ఆగస్టు 20:** మంత్రులు, ప్రజాప్రతినిధులు పెంచుకునే కుక్కలకు ఉన్న సౌకర్యాలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు లేవని కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజిత్ దీప్కే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహారాష్ట్రలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారిందని, కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యార్థులను ఇలాంటి పరిస్థితుల్లో చదివిస్తున్నందుకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భుసే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమంలో భాగంగా లాతూర్ జిల్లా ఔసా తహసీల్‌లోని ఉజని జిల్లా పరిషత్ పాఠశాలను సీజేపీ బృందంతో కలిసి దీప్కే పరిశీలించారు. పాఠశాలలో సరైన తరగతి గదులు, బెంచీలు, మరుగుదొడ్లు, ఇతర కనీస వసతులు లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రేకుల కప్పుల నుంచి నీరు కారడం, పాఠశాల పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, అపరిశుభ్ర వాతావరణంతో ఆవరణలు పాములకు నిలయాలుగా మారుతున్నాయని ఆరోపించారు. పాముకాటు ఘటనల్లో పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నా అధికార యంత్రాంగంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించలేని నాయకులకు ప్రజలు ఎందుకు ఓటేయాలని దీప్కే ప్రశ్నించారు. కేవలం హెలికాప్టర్లలో తిరిగేందుకే నాయకులకు ప్రజలు ఓట్లు వేస్తున్నారా అంటూ నిలదీశారు. 'ధర్మం ప్రమాదంలో ఉంది' అంటూ రాజకీయాలు చేసే నేతలు ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో ఉందన్న విషయాన్ని గుర్తించాలని హితవు పలికారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తేనే అక్కడి వాస్తవ పరిస్థితులు వారికి అర్థమవుతాయని అన్నారు. పాఠశాలలను బాగుచేసే వరకు ఓట్ల కోసం వచ్చే నాయకులను గ్రామాల్లోకి రానివ్వకూడదని ప్రజలకు పిలుపునిచ్చారు.

### 2029లో జెన్ జీ దెబ్బ చూపిస్తుంది

2029 ఎన్నికల నాటికి జెన్ జీ యువత కీలకమైన ఎన్నికల శక్తిగా అవతరిస్తుందని దీప్కే హెచ్చరించారు. యువత, విద్యార్థుల సమస్యలను రాజకీయ పార్టీలు పరిష్కరించకపోతే ఎన్నికల్లో మూల్యం చెల్లించక తప్పదన్నారు. పాఠశాలల్లో కనీస సౌకర్యాలను తక్షణమే మెరుగుపరచకపోతే గ్రామాల వారీగా పెద్దఎత్తున నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు. లాతూర్ నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసుపైనా దీప్కే స్పందించారు. దర్యాప్తు కిందిస్థాయి నిందితులకే పరిమితమవుతోందని, పెద్ద తలకాయలను కాపాడే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఉన్నతస్థాయి అధికారుల ప్రమేయం లేకుండా ఇంత పెద్ద వ్యవహారం జరగడం సాధ్యం కాదని, అసలు బాధ్యులను బయటకు తీసుకొచ్చేలా సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కల్పించిన పరిగి "షీ" టీమ్ పోలీసులు

- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ( IPS) మరియు పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశానుసారం




**పరిగి మున్సిపల్, ఆగస్టు,20:** వికారాబాద్ జిల్లా పరిగి పట్టణ కేంద్రంలోని గ్లోబల్ స్కూల్ లో పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ మెంబర్స్ సమక్షంలో మహిళలపై జరుగుతున్న నేరాలపై స్కూల్ విద్యార్థినీ,విద్యార్థులకు అవగాహన కార్యక్రమము నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.మహిళ పై జరుగుతున్న నేరాలు.నిర్భయ చట్టం, "షీ" టీమ్ నం -181. సీసీ POCSO Act గురించి.112డయాల్, కేమెరాలు.బాల్య వివాహాలు.బాల కార్మిక వ్యవస్థ.కమ్యూనిటీ పోలిసింగ్.మానవ అక్రమ రవాణా.మద్యపాన నిషేధం.బ్యాంకింగ్ ఆన్లైన్ మోసాలు.గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం.Cyber crimes No:1930 పై అవగాహన.వివిధ అంశాలపై విద్యార్థిని లకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆయాశా,మరియు ఇంచార్జి బలరాజ్,ఉపాధ్యాయుల బృందం, విద్యార్థినిలు, విద్యార్థులు, మరియు "షీ" టీమ్ సభ్యులు బి.సావిత్రి,శోభ పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు

- మెడిపల్లిలో కల్తీ మసాలాల తయారీ కేంద్రంపై పోలీసుల మెరుపుదాడి
- 10.89 టన్నుల మసాలాలు స్వాధీనం — విలువ రూ.25 లక్షలు
- కారం పొడిలో 30 శాతం రంపపు పొడి కలిపినట్లు గుర్తింపు — ఇద్దరు అదుపులో

**హైదరాబాద్, ఆగస్టు 20 :** ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ ఆహార పదార్థాలను కల్తీ చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి హెచ్చరించారు. ఆమె ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎస్ఓటీ మల్కాజిగిరి, ఫుడ్ అడల్టరేషన్ సర్వెలెన్స్ బృందాలు గురువారం మెడిపెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో ఉన్న సాయి తిరుమల ఎంటర్‌ప్రైజెస్‌పై దాడి నిర్వహించాయి. పసుపు, కారం, ధనియాల పొడి, గరం మసాలాలను ఆహార భద్రతా ప్రమాణాలు పాటించకుండా అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారు చేసి ప్యాకింగ్ చేస్తున్నట్లు గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. ముఖ్యంగా కారం పొడిలో 30 శాతం రంపపు పొడి (సా డస్ట్) కలిపినట్లు గుర్తించారు. అసలు బ్రాండ్లను పోలిన నకిలీ ప్యాకింగ్, లేబుళ్లతో నాసిరకం ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. దాడిలో 2,300 కిలోల పసుపు పొడి, 3,350 కిలోల కారం పొడి, 5,140 కిలోల ధనియాల పొడి, 100 కిలోల గరం మసాలా సహా మొత్తం 10.89 టన్నుల మసాలా పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి అంచనా విలువ సుమారు రూ.25 లక్షలు. ఈ వ్యవహారంలో సత్యనారాయణ, రుద్రశేఖర్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని తదుపరి చర్యలు చేపట్టారు. వినియోగదారులు ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు కొనుగోలు చేసేటప్పుడు తయారీ తేదీ, బెస్ట్ బిఫోర్, బ్యాచ్ నంబర్, ఎఫ్ఎస్ఎస్ఏఐ వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలని కమిషనర్ సూచించారు. కల్తీ ఆహార పదార్థాల తయారీ, నిల్వ లేదా విక్రయాలపై సమాచారం ఉంటే 8712662111 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే కల్తీ వ్యాపారాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ బి. సుమతి స్పష్టం చేశారు.

# భోగారం రైతు వేదికలో వాలంటీర్లకు డిజిటల్ క్రాప్ సర్వే

**2026వానాకాలం సీజన్ పై అవగాహన**

**గుండుమాల్ మండలం, ఆగస్టు,20:** గుండుమల్ మండలంలోని భోగారం రైతు వేదికలో వాలంటీర్లకు డిజిటల్ క్రాప్ సర్వే (DCS) – 2026 వానాకాలం సీజన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 7 ప్రాధాన్య పంట రకాలు మరియు వాటి గుర్తింపుపై స్టేట్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించడం జరిగింది



1. డిలర్ వద్ద వరి 7 రకాల విత్తనాలు కొనుగోలు చేసిన వివరాలను రైతులు సంబంధిత డీలర్ లాగిన్‌లో నమోదు చేయించుకోవాలి.

2. రైతు స్వయంగా ఉత్పత్తి చేసుకున్న విత్తనాలను వినియోగించిన రైతుల వివరాలను, రైతు స్వీయ ధృవీకరణ (Self Declaration) తీసుకుని, సంబంధిత AEO లాగిన్‌లో నమోదు చేయించుకోవాలి.ముఖ్య గమనిక: రైతులు కొనుగోలు చేసిన 7 ప్రాధాన్య రకాలు (1.RNR 15048 తెలంగాణ సోనా, 2. KNM 1638 కూనారం వరి –2, 3. జై శ్రీరామ్, 4. KNM 7715, 5. BPT 5204 సాంబ మసూరి, 6. HMT సోనా, 7. WGL 44 సిద్ధి ) ప్రభుత్వం సిఫారసు చేసిన వరి సన్న రకాల విత్తనాల వివరాలు తప్పనిసరిగా సెల్ఫ్ డిక్లరేషన్ ఫామ్ నింపి ఇస్తేనే క్వింటాల్ కి 500/- బోనస్‌కు అర్హత లభిస్తుంది.కావున సంబంధిత డీలర్లు మరియు DCS వాలంటీర్లు ఈ విషయాన్ని రైతులకు స్పష్టంగా తెలియజేసి, నమోదు ప్రక్రియను సక్రమంగా పూర్తి చేయాలి.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు (AEOs) కే. తిరుపతి, హర్షవర్ధన్, నరేందర్ మరియు గుండుమల్ మండలంలోని వివిధ గ్రామాల DCS వాలంటీర్లు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు



**వలిగొండ ఆగస్టు 20 :**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా సందర్శించారు. ఆస్పత్రి ఆజ రిజిస్టర్ లను పరిశీలించి వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారా అవసరమైన మందులు తగినంతగా ఉన్నాయా ఆస్పత్రికి వస్తున్న రోజులు వివరాలు నమోదు అవుతున్న కేసులు గురించి సిబ్బంది అడిగి తెలుసుకున్నారు వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సమృద్ధిగా అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎరుపుల వెంకటేశం, ఎంపీడీవో జలంధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# కేశవాపూర్ ను సోలార్ మోడల్ విలేజ్ గా అభివృద్ధి చేస్తాం:

## మంత్రి పొన్నం

**హనుమకొండ, ఆగస్టు 20:** ఎల్కతుర్తి మండలం కేశవాపూర్ ను ఆదర్శ గ్రామంగా, సోలార్ మోడల్ విలేజ్ గా అభివృద్ధి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. “పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన” కార్యక్రమంలో గ్రామస్థుల నుంచి వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్, సోలార్ పంపుల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. గుంటూరుపల్లె–కేశవాపూర్ రహదారికి రూ.3.5 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. గ్రామంలో 300 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తే గ్రామాభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.




# ఆయిల్‌పామ్ తోటను సందర్శించిన వ్య సురేంద్ర మోహన్ (ఐఏఎస్)

**నార్వా మండలం, ఆగస్టు,20:** నారాయణపేట: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ ఐఏఎస్ నారాయణపేట జిల్లా నార్వా మండల కేంద్రంలోని కుమార్లింగంపల్లి గ్రామంలో రైతు గోపాల్ రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ రైతు గోపాల్ రెడ్డి గారితో ముఖ్య కార్యదర్శి మాట్లాడి, ఆయిల్‌పామ్ సాగులో ఆయన అనుభవాలు, సాగు విధానం, దిగుబడులు, ఆదాయం తదితర వివరాలను తెలుసుకున్నారు. రైతు గోపాల్ రెడ్డి 2022 సంవత్సరంలో తన 8 ఎకరాల భూమిలో ఆయిల్‌పామ్ తోటను ఏర్పాటు చేసుకున్నారు. గత సంవత్సరం నుండి తోటలో దిగుబడి ప్రారంభమై, సుమారు 40 టన్నుల దిగుబడిని పొందడంతో



రూ.6.80 లక్షల ఆదాయం సాధించినట్లు తెలిపారు.ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతు సాధించిన ఆదాయంపై ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ ఐఏఎస్ సంతోషం వ్యక్తం చేసి, రైతును అభినందించారు. అలాగే కుమార్లింగంపల్లి గ్రామంలోని ఇతర ఆయిల్‌పామ్ రైతులతో కూడా మాట్లాడి, ఆయిల్‌పామ్ సాగు ద్వారా పొందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ తోట నుంచే వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారితో ఫోన్‌లో మాట్లాడారు. రైతులతో మంత్రిగారిని మాట్లాడించి, ఆయిల్‌పామ్ సాగు ద్వారా తాము పొందుతున్న లాభాలు, తమ అనుభవాలను రైతులు మంత్రిగారితో పంచుకున్నారు.రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు మరింతగా ప్రోత్సహిస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సాయిబాబా, మక్తల్ నియోజకవర్గ ఉద్యాన అధికారి రామకృష్ణ, జిల్లా ఆయిల్‌ఫెడ్ మేనేజర్ రాధాకృష్ణ, ఉద్యాన విస్తరణ అధికారులు జనార్ధన్, లింగరాజ్, ఫయాజ్, ఈశ్వర్ తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే కుమార్లింగంపల్లి గ్రామానికి చెందిన సుమారు 20 మంది ఆయిల్‌పామ్ రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎంహెచ్ఏ పోర్టల్స్ లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ప్రథమ స్థానం



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 20:** కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని ఆధునిక పోర్టల్స్ వినియోగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ‘సమన్వయ’ కేటగిరీలో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అభినందించారు. ‘స్పార్క్ క్లబ్’ ద్వారా విద్యార్థులకు ఆన్ లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టులు తదితర సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. యువత సైబర్ భద్రతపై కుటుంబ సభ్యులు, స్నేహితులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు.

# ఇచ్చోడ ఇస్లాంపూర్ లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం



**ఆదిలాబాద్, ఆగస్టు 20:** జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఇచ్చోడ మండలం ఇస్లాంపూర్ గ్రామంలో గురువారం తెల్లవారుజామున కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించినట్లు ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్ తెలిపారు. సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో ఉదయం 5 గంటల నుంచి నిర్వహించిన విస్తృత తనిఖీల్లో సరైన పత్రాలు లేని 110 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, నాలుగు కార్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో నంబర్ ప్లేట్లు లేని, నకిలీ నంబర్ ప్లేట్లు కలిగిన 15 ద్విచక్ర వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి సేవనం, నిల్వ, రవాణా, విక్రయం, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, మట్కా తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏఎస్పీ హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

# సన్న బియ్యం పంపిణీలో పారదర్శకత పాటించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బోయినిపల్లి, ఆగస్టు 20:** రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు సన్న బియ్యాన్ని పారదర్శకంగా పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం బోయినిపల్లి మండల కేంద్రంలోని చౌక ధరల దుకాణాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యం పంపిణీ, లబ్ధిదారుల వివరాల ఆన్‌లైన్ నమోదు, ఇప్పటివరకు బియ్యం పొందిన వారి వివరాలను పరిశీలించారు. పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలని సూచించారు. తనిఖీలో తహసీల్దార్ షరీఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఐఆర్ ను పారదర్శకంగా పూర్తి చేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం, ఆగస్టు 20:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్–



2026) ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలో నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసుల జారీ, ధ్రువపత్రాల పరిశీలనను ఆయన తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకుని ప్రతి కేసును నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించి, అక్టోబర్ 15 వరకు తదుపరి ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొలగించడం అన్యాయం.

**వలిగొండ ఆగస్టు 20 :**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాలు చేసి ఇటీవల అమరుడైన మాజీ ఎమ్మెల్యే కీ. శే. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొలగించడం ఉద్యమకారులను అవమానపరిచినట్టేనని అని ఉద్యమకారుల పోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య ఒక ప్రకటనలో విమర్శించారు. వెంటనే తొలగించిన చోటనే విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## కేంద్రీయ విద్యాలయం ములుగులో 2026-27 ప్రవేశాలు ప్రారంభం

**ములుగు, ఆగస్టు 20:** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయం ములుగులో 2026–27 విద్యా సంవత్సరానికి నూతన ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రిన్సిపల్ సీతారాం తెలిపారు. బాలవాటిక–1, 2, 3తో పాటు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. సెప్టెంబర్ 10న లాటరీ నిర్వహించి, 12న ప్రవేశ జాబితా ప్రకటిస్తారు. సెప్టెంబర్ 15 నుంచి 21 వరకు ప్రవేశాలు, ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసి, సెప్టెంబర్ 23 నుంచి తరగతులు ప్రారంభిస్తారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ మార్గదర్శకాలు, వయస్సు, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ప్రవేశాలు నిర్వహిస్తామని, ఆసక్తిగల తల్లిదండ్రులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సీతారాం కోరారు.

## దమ్మపేటలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు



**దమ్మపేట, ఆగస్టు 20:** దమ్మపేట మండలంలోని పట్వారిగూడెం పీహెచ్‌సీ, గండుగులపల్లి మోడల్ సోలార్ గ్రామం, మదలపల్లి గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రూ.3 లక్షల విలువైన అనాలసిస్ యంత్రం ఏడాదిగా పనిచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. గండుగులపల్లిలో 250 ఇళ్ల లక్ష్యానికి గాను 242 ఇళ్లలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పూర్తయిందని, మిగిలిన పనులను వేగవంతం చేసి గ్రామాన్ని మోడల్ సోలార్ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. గురుకుల పాఠశాలలో అపరిశుభ్రత, మెనూ అమలులో నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసి ప్రిన్సిపాల్, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

## పోటీ పరీక్షల్లో విజయానికి ప్రణాళికాబద్ధమైన సాధన అవసరం: కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాల పల్లి ఆగస్టు20:**జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సందర్శించి, పుస్తకాలు, డిజిటల్ లైబ్రరీ, మౌలిక వసతులను పరిశీలించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడిన ఆయన, నిర్దిష్ట లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా, క్రమశిక్షణతో చదివితే విజయం సాధించవచ్చని సూచించారు. అభ్యర్థులకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలు, కంప్యూటర్లు, ఆర్‌ఓ వాటర్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, గ్రంథాలయాల బలోపేతానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం గ్రంథాలయ ప్రాంగణంలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, గ్రంథాలయ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మంథనిలో సమస్యల పరిష్కారానికి సమగ్ర చర్యలు: కలెక్టర్ కోయ శ్రీహర్ష

**మంథని, ఆగస్టు 20:** క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి తక్షణ



పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం మంథని ప్రాంతంలో పర్యటించిన ఆయన, సింగరేణి నీటితో వ్యవసాయ భూములు ముంపునకు గురికాకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరానికి ప్రారంభించాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు మంథని పట్టణంలో పారిశుద్ధ్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# ఘనంగా వలిగొండలో రాజీవ్ గాంధీ 82 వ జయంతి వేడుకలు



**వలిగొండ ఆగస్టు 20** :యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మాజీ ప్రధానమంత్రి భారతరత్న ఆధునిక భారత నిర్మాత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను వలిగొండ పట్టణ కేంద్రంలో వలిగొండ మండల, పట్టణ,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్, పోలేపాక జానకి రాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ దేశంలో శాంతి సౌభ్రాతృత్వం, మతసామరస్యం,ఐక్యతను పెంపొందించాలనే సందేశం తో జరుపుకునే సద్భావన దినోత్సవం ప్రజలందరికీ ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని సమైక్యతే మన శక్తి సద్భావమే మన ప్రగతి అనే స్ఫూర్తితో రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని బలమైన భారతదేశ నిర్మాణానికి మన వంతు కృషి చేయాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజ్,పబ్బు సురేందర్, ఐటిపాముల రవీంద్ర,కొండూరు భాస్కర్, రేఖల ప్రభాకర్, బద్దం సంజీవరెడ్డి, రేసు బుచ్చిరెడ్డి, చిలుగూరి సత్తిరెడ్డి, ఉలిపే మల్లేశం, మస్కు నరసింహ, కాసుల వెంకన్న, ఎండి. ఖుర్షిద్,కొండూరు సాయి,బత్తిని వరుణ్ గౌడ్, ఆదిమూలం సోమేష్ ,రాపోలు శ్రీనివాస్,దండ మల్లికార్జున్, రాచమల్ల తిరుపతయ్య, మైసొల్ల యాదగిరి, ఎండి షర్ఫోద్దిన్,తదితర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవనూర్ లో మంచినీటి బోర్లకు మరమత్తులు

- ఒకే రోజులో సమస్యకు పరిష్కారం
- సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు.

**యాలాల మండలం, ఆగస్టు,20:** యాలాల మండలంలోని దేవనూర్ గ్రామంలోని దుబ్బతండా 10వ వార్డులో మరియు 1వ వార్డు హనుమాన్ దేవాలయం వద్ద మంచినీటి బోరు మరమ్మతుకు గురైంది. దీంతో ఆయా వార్డుల్లో తాగునీటి సమస్య ఏర్పడింది.విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు దృష్టికి తీసుకురాగానే వెంటనే స్పందించారు. చెప్పిన వెంటనే స్పందిస్తూ ఒకే రోజులో బోరును రిపేర్ చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ ను అభినందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు మాట్లాడుతూ,, గ్రామంలో ఎక్కడ మంచినీటి సమస్య ఏర్పడినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, సమస్య పరిష్కారానికి తాను ముందుండి పనిచేస్తానని అన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.





## చింతలపాలెంలో రూ.23 కోట్ల డబుల్ రోడ్డుకు మంత్రి ఉత్తమ్ శంకుస్థాపన



**సూర్యాపేట, ఆగస్టు 20:** చింతలపాలెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం శ్రీకారం చుట్టారు. అడ్లూరు R&R సెంటర్‌లో రూ.23 కోట్లతో మేళ్లచెరువు నుంచి చింతిర్యాల వరకు నిర్మించనున్న డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రేబల్లెలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా శక్తి భవనాన్ని ప్రారంభించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలు, తండాలకు నూతన రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకొని వ్యాపారాలు, డెయిరీల ద్వారా ఆదాయం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తేనెటీగల పెంపకంతో స్వయం ఉపాధి: కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్, ఆగస్టు 20:** తేనెటీగల పెంపకం రైతులకు అదనపు ఆదాయంతో పాటు స్వయం ఉపాధికి మంచి మార్గమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. హవేలీ ఘన్‌పూర్ మండలం బోగడ భూపతిపూర్‌లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తేనెటీగల పెంపకాన్ని గురువారం ఆమె పరిశీలించారు. 10 మంది రైతులకు 40 శాతం సబ్సిడీపై 104 తేనెటీగల పెంపకం బాక్సులు అందించినట్లు తెలిపారు. ఒక్కో బాక్సు విలువ రూ.6 వేలు కాగా రూ.2,400 సబ్సిడీ, రూ.3,600 లబ్ధిదారుడి వాటాగా ఉంటుందన్నారు. తేనె ఉత్పత్తితో రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు పంటల ఉత్పాదకత కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై రైతులు దృష్టి సారించి ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, వ్యవసాయ శాఖ అధికారి దేవకుమార్, రైతులు పాల్గొన్నారు.

## జగిత్యాలను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి




**జగిత్యాల, ఆగస్టు 20:** జగిత్యాల జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపల్లి చందన పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో బాల్య వివాహాల నిషేధ చట్టం–2006పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, 18 ఏళ్లలోపు గర్భం దాల్చిన వారి వివరాలను పర్యవేక్షించాలని, బాలికలు పాఠశాల మానకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా ప్రకటించే దిశగా కృషి చేయాలన్నారు. అదనపు కలెక్టర్ బి.ఎస్. లలిత మాట్లాడుతూ బాలికలకు విద్య, నైపుణ్యాలు అందించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రోత్సహించాలని తెలిపారు.

## వికలాంగుల సంక్షేమ శాఖలో అవినీతిపై విచారణ జరిపించాలి: DHPS



**హైదరాబాద్, ఆగస్టు 20( :** వికలాంగుల సంక్షేమ శాఖలో నిధుల దుర్వినియోగం, కొనుగోళ్లు, టెండర్లు, నాసిరకం పరికరాల సరఫరాలో భారీ అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సీబీఐ లేదా ఏసీబీతో సమగ్ర విచారణ జరిపించాలని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి (DHPS) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేసింది. మోటార్ వాహనాలు, ల్యాప్‌టాప్‌లు, బ్యాటరీ వీల్‌చైర్ల నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు చేపట్టాలని, రిటైర్డ్ ఉద్యోగుల అనధికారిక కొనసాగింపును నిలిపివేయాలని, దివ్యాంగుల స్టడీ సర్కిళ్లను పునరుద్ధరించాలని కోరింది. హాస్టళ్లలో అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. వినతిపై స్పందించిన మంత్రి, శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శృతి ఓజాతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు DHPS తెలిపింది. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ పిల్లి అంజయ్య, అధ్యక్షుడు పి. రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్రూర్ గ్రామపంచాయతీ అంగన్వాడి సెంటర్ ను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



**వలిగొండ ఆగస్టు 20** :యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఆర్రూర్ గ్రామ పంచాయతీ మరియు అంగన్వాడి సెంటర్ ను సందర్శించారు. గ్రామపంచాయతీ సంబంధించిన హాజరు రిజిస్టర్ లను పరిశీలించి పరిశుద్ధ నిర్వహణ మొక్కల పెంపకం వర్షపు నీటి నిల్వ కోసం అనువైన ప్రదేశాల గుర్తింపు వాటి నిర్మాణానికి సంబంధించిన పురోగతిని సమీక్షించారు అలాగే అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరు రిజిస్టర్ లను పరిశీలించారు గర్భిణీలు శిశువుల హాజరు కేంద్రంలో అందుబాటులో ఉన్న స్టాక్ నిలువ సామగ్రి నాణ్యతను పరిశీలించారు అంగన్వాడి చిన్నారులతో స్వయంగా మాట్లాడి వారికి అందిస్తున్న ఆహారం నాణ్యత రుచి మరియు ఆహారం సక్రమంగా అందుతున్న తీరుపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జలంధర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి ప్రేమలత, ఏపీవో టీ. పరుశరాములు, గ్రామపంచాయతీ కార్యదర్శి డి రమేష్, వైద్య సిబ్బంది అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి.

- సిపిఎం డిమాండ్.
- వలిగొండ తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా.



**వలిగొండ ఆగస్టు 20 :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలంటూ గద్దెనెక్కిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం,రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటిని భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామిలు అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో వలిగొండ తహసిల్దార్ కార్యాలయం వద్ద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ధర్నా నిర్వహించిన అనంతరం తహసిల్దార్ దశరథ నాయక్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన 12 సంవత్సరాల కాలంలో ఉద్యోగాలను భర్తీ చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పోరాడుతుంటే వారిపై దేశద్రోహులని ముద్ర వేసేందుకు కుట్ర చేస్తుందన్నారు ప్రస్తుతం దేశంలో 1 కోటి 83 లక్షల ఖాళీ పోస్టులు ఉన్నాయని ఒక్క రైల్వే డిపార్ట్మెంట్ లోనే 1.08 లక్షల పోస్టులు ఖాళీలు ఉన్నాయని వీటన్నిటినీ వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో 2 లక్షల ఖాళీ పోస్టులు ఉన్నాయని ఉన్నాయని తాము అధికారంలోకి వస్తే రెండేళ్లలో ఖాళీ పోస్టులన్నిటిని భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ వాటిని భర్తీ చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. యూత్ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటేశం, కూర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు కలుకూరి రామచంద్రర్, వలిగొండ పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,నాయకులు రాధారపు మల్లేశం, కొండూరు సత్తయ్య, వేముల చంద్రయ్య ,శీలం ఇందిర,వేముల లక్ష్మయ్య,గంగాపురం వెంకటేశం, మైసోల్ల నరేందర్, దొడ్డి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యసన స్థాయి పెంపొందించాలి..

**క్లస్టర్ రిసోర్స్ పర్సన్ బాలరాజు**

**కోస్గి మండలం, ఆగస్టు,20:**
ఉన్నత,ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని క్లస్టర్ రిసోర్స్ పర్సన్ బాలరాజు అన్నారు.గురువారం మండలంలోని సర్జఖాన్ పెట్,తొగపూర్ లలోని ప్రాథమిక పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న విద్యార్థుల విద్యా స్థాయి ప్రమాణాలు మెరుగుపడేలా చూడాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల అభ్యసన,స్థాయి ప్రమాణాలు పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతిలోని ప్రతి విద్యార్థి అక్షర దోషాలు,తప్పులు లేకుండా రాయగలగలని,పాఠ్యాంశాలను ధారాళంగా చదవాలని,గణితంలో ప్రాథమిక భావాలను అర్థం చేసుకొని లెక్కలు చేయడం వంటి అంశాలను ఉపాధ్యాయులు గుర్తించి విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు.విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు అన్ని పాఠశాలలో విద్యార్థుల అభ్యసన స్థాయి పరిశీలన చేయడం జరుగుతుందన్నారు.



# నో మ్యాపింగ్,అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేయాలి

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**




**వికారాబాద్, ఆగస్టు,20:**ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనమలిస్ ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు.ఓటరు జాబితా, మండలాల వారీగా గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ వివరాలు, నోటీసులు జారీ చేసి చెక్ చేయాలనీ,7 రోజు లు టైమిచ్చి పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా నో మ్యాపింగ్, అనమలిస్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎ.ఈ.ఆర్.ఓ. లను కేటాయించి, వారికి కొత్త లాగిన్లు ఏర్పాటు చేసి, ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని,నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, నిర్ణీత విధానంలో విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు , సమగ్ర సర్వే లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, ఎం పి డి ఓ లు, తహసీల్దార్ లు సమన్వయంతో పని చేసి నోటీసుల జారీ, విచారణ ప్రక్రియను నిర్ణత సమయం లో పూర్తి చేయాలనీ, గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, నిర్ణీత విధానంలో విచారణ నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అనంతరం చేయూత పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనపై ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సమీక్ష సమావేశం.జిల్లాలో చేయూత పింఛన్ల పంపిణీ, అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు, అలాగే ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మండలాల వారీగా చేయూత పింఛన్ల పరిస్థితి, కొత్తగా అర్హత పొందిన లబ్ధిదారుల వివరాలు, పెండింగ్ దరఖాస్తులు తదితర అంశాలపై సమీక్షించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన చేపట్టాలని కలెక్టర్ సూచించారు.పింఛన్లకు సంబంధించి అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాలతో ప్రయోజనం పొందని వారి వివరాలను గుర్తించి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి మండలాల వారీగా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత కలిగిన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులో ప్రక్రియను పూర్తి చేయాలని ఎంపీడీఓలకు సూచించారు.ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రాధాన్యత కల్పించాలని, దరఖాస్తుల పరిశీలనలో పూర్తి పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో ప్రజలకు పథకాలపై సరైన సమాచారం అందించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని అధికారులను ఆదేశించారు అంతకు ముందు జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ చేయూత పెన్షన్ ల దరఖాస్తు లు, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు ల పై మండలం వారీగా జనాభా ను బట్టి ఎన్ని దరఖాస్తు లు వచ్చాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ స్వర్ణలత, ఆర్ డి ఓ వాసు చంద్ర,సంబంధిత జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఆధునిక భారత నిర్మాణానికి, ఐటీ విప్లవానికి పునాది వేసిన మహానేత రాజీవ్ గాంధీ.. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





**హనుమకొండ, ఆగస్టు 20 ::** భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు అన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం హనుమకొండ డీసీసీ భవన్‌లో ఆయన చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వరంగల్ జిల్లా కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్ ఆధ్వర్యంలో వరంగల్ ఎంజీఎం సెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆధునిక భారతదేశ నిర్మాణానికి, సాంకేతిక రంగం, ఐటీ అభివృద్ధికి పునాదులు వేసిన దార్శనిక నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. యువతకు ఓటు హక్కు వయోపరిమితిని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించడం ద్వారా దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో యువతకు మరింత భాగస్వామ్యం కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని అన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడు తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యువతకు ఓటు ఫారాలను అందజేశారు. దేశ అభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని, పేదలకు కూడు, గూడు, గుడ్డ అందించాలనే సంకల్పంతో పనిచేశారని నాగరాజు పేర్కొన్నారు. దేశం కోసం ఇందిరాగాంధీ అనంతరం రాజీవ్ గాంధీని సైతం కోల్పోయిన గాంధీ కుటుంబం నేటికీ దేశ సేవలో కొనసాగుతోందని అన్నారు. రాజీవ్ గాంధీ చూపిన అభివృద్ధి, ప్రజాసేవ, యువత సాధికారత మార్గంలో ముందుకు సాగడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెండికొండ సిద్దేశ్వర స్వామి ఆలయ పౌండర్ ట్రస్టు దంపతులకు ఘన సన్మానం



**శంషాబాద్ అగస్టు20:** శంషాబాద్ పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ వెండికొండ సిద్దేశ్వర స్వామి ఆలయ పౌండర్ ట్రస్టు మడపతి నరేందర్, పరమేశ్వరి దంపతులను నూతన జాతర కమిటీ అధ్యక్షుడు బండి శ్రీకాంత్ యాదవ్ గురువారం ఘనంగా సన్మానించారు. సిద్దేశ్వర ఆలయానికి గత 25 సంవత్సరాల క్రితం ఫౌండర్ ట్రస్ట్ గా బాధ్యతలు స్వీకరించిన మాడపత్తి నరేందర్ ఆలయ అభివృద్ధితోపాటు జాతరను వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జాతర ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయం అభివృద్ధితోపాటు త్వరలో జరిగే జాతరను వైభవంగా నిర్వహిస్తామని నూతన అధ్యక్షుడు బండి శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ ఉపాధ్యక్షుడు శివారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాల్ యాదవ్ లతోపాటు పలువురు భక్తులు నాయకులు పాల్గొన్నారు.

## యు. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా నాయకుల ఆత్మీయ సమ్మేళనం



**తాండూరు మున్సిపల్, ఆగస్టు,20:**
వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నూతన సారథి యు. రమేష్ కుమార్ నియమితులైన అనంతరం మొదటిసారిగా, తాండూరు పట్టణ కేంద్రంలోని వారి నివాసంలో నిర్వహించిన బీజేపీ జిల్లా నాయకుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మారుతి కిరణ్ బూనేటి పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై జిల్లా నాయకులతో ఆత్మీయంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూపా రెడ్డి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని టిఆర్ఎస్ఎంఏ డిమాండ్.



**భువనగిరి ఆగస్టు 20 :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని మదర్ తెరిసా స్కూల్ చనిపోయిన రూపా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేస్తూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా టి ఆర్ ఎస్ ఎం ఎ జిల్లా అధ్యక్షుడు పాలకూర వెంకటేశం గౌడ్ మాట్లాడుతూ, నేటి సమాజంలో విద్యాబుద్ధులు నేర్పించి తల్లిదండ్రుల తర్వాత తల్లిలాగా జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడానికి తప్పు ప్రవర్తన ఉన్నవారిని మందలించినందుకు ఆమెను అతి కిరాతకంగా చంపినందుకు సభ్య సమాజం తలదించుకోవాల్సిన అవసరం ఉంది. అసలు సమాజంలో ఉపాధ్యాయులకు రక్షణ లేకుంటే , దేశ భవిష్యత్తు తీర్చిదిద్దే వాళ్ళు ఎవరు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గాదె సోమిరెడ్డి, జిల్లా కార్యదర్శి వంగూరు పాండు, తుంగతుర్తి రంగారావు, దుర్గాప్రసాద్, చిన్నను సురేష్, తోటకూర యాదయ్య, రఘు అఖిలప్రియ కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

## జలమండలి టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్ కు టీజీఓ శుభాకాంక్షలు



జలమండలి టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్ జన్మదినం సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ శాఖ ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ శాఖ అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్, శాఖ సెక్రటరీ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో గురువారం జలమండలి ప్రధాన కార్యాలయంలోని డైరెక్టర్ టెక్నికల్ చాంబర్‌లో శుభాకాంక్షల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీజీఓ ఆఫీస్ బేరర్స్ చంద్రజ్యోతి, టి.వి. సరస్వతి, అసోసియేషన్ ప్రతినిధులు, జలమండలి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చురకలు

శుక్రవారం 21.08.2026

## పీసీ & పీఎన్‌డీటీ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి: డీఎంహెచ్‌వో



**సంగారెడ్డి, ఆగస్టు 20:** గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను అరికట్టేందుకు PC&PNDT చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. కే. లలిత దేవి సూచించారు. జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో స్కానింగ్ కేంద్రాల పనితీరు, రికార్డుల నిర్వహణ, చట్ట అమలుపై సమీక్షించారు. లింగ నిర్ధారణ చేయడం లేదా ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డా. ప్రవీణ్, వనజారెడ్డి, డా. రాజు గౌడ్, డా. శైలజ, డా. సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్ కు టీజీఓ శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఆగస్టు 20 :**జలమండలి టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్ జన్మదినం సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ శాఖ ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ శాఖ అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్, శాఖ సెక్రటరీ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో గురువారం జలమండలి ప్రధాన కార్యాలయంలోని డైరెక్టర్ టెక్నికల్ చాంబర్‌లో శుభాకాంక్షల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీజీఓ ఆఫీస్ బేరర్స్ చంద్రజ్యోతి, టి.వి. సరస్వతి, అసోసియేషన్ ప్రతినిధులు, జలమండలి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గోశాల నిర్మాణానికి స్థలం కేటాయించాలి

**తహశీల్దార్ కు కోటగిరి గ్రామ పంచాయతీ వినతి, ఏకగ్రీవ తీర్మానం**



**కోటగిరి, ఆగస్టు 20 ::-** కోటగిరి గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్లపై తిరుగుతున్న పశువుల రక్షణార్థం గోశాల నిర్మాణానికి వీలుగా గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరుతూ గ్రామ పంచాయతీ పాలకవర్గం, తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసింది. గ్రామంలో ప్రస్తుతం సుమారు 50 వరకు వీధి పశువులు రోడ్లపై సంచరిస్తున్నాయి. వీటి వల్ల వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.అంతేకాకుండా, సమీపంలోని పంట పొలాల్లోకి జొరబడి పంటలను నాశనం చేస్తున్నాయని రైతుల నుంచి పలు ఫిర్యాదులు అందాయి.ఈ సమస్య తీవ్రతను గుర్తించిన పాలకవర్గం, ఆగస్టు 14న నిర్వహించిన సాధారణ సమావేశంలో గోశాల ఏర్పాటుపై ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. వీధి పశువుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గోశాల నిర్మించడమే ఉత్తమ మార్గమని భావించి, వెంటనే అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కేటాయించాలని తహశీల్దార్‌ను విజ్ఞప్తి చేశారు.

## కోటగిరిలో ఉచిత వైద్య శిబిరం పోస్టర్ల విడుదల



**కోటగిరి,ఆగస్టు 20 :-** రామకృష్ణ మఠం (హైదరాబాద్), రామకృష్ణ సేవా సమితి (కోటగిరి) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరం పోస్టర్లను కోటగిరి గ్రామ సర్పంచ్ గారు బర్ల మధు గురువారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. దీర్ఘకాలిక రోగాలు, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోటగిరి, పోతంగల్ మండలాల ప్రజలందరూ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేదవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రామకృష్ణ మఠం సేవలు అభినందనీయమని, ప్రజల ఆరోగ్యం పట్ల వారు చూపుతున్న శ్రద్ధ ప్రశంసనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా మొక్క నాటిన మాజీ మంత్రి రెడ్యా నాయక్

**ఉగ్గంపల్లి, ఆగస్టు 20:**మాజీ ఎంపీ, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త జోగినపల్లి సంతోష్ కుమార్ పిలుపు మేరకు మాజీ మంత్రి, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యా నాయక్ తన పుట్టినరోజు సందర్భంగా ఉగ్గంపల్లిలోని తన నివాసంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో ప్రారంభమైన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ నేడు, విదేశాలకు విస్తరించి పర్యావరణ పరిరక్షణ ఉద్యమంగా మారడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోత్ కవిత, కలికనేని హరిత, ఉగ్గంపల్లి సర్పంచ్ ఎండి అయూబ్ పాషా, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సభ్యులు పట్ల వంశీ, బీఆర్ఎస్ నాయకులు, ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు.

# నిస్వార్థ సేవకు నూతన నాంది..

- లయన్స్ జిల్లా క్యాబినెట్ ప్రమాణ స్వీకారం
- 'సేవా సంబరం'తో సేవా స్ఫూర్తికి నూతనోత్సాహం
- జిల్లా గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి
- సేవా బాటలో మరో మైలురాయి... 100 కుట్టుమిషన్లు, 80 సైకిళ్లు, 1,000 బ్యాగులు పంపిణీ
- విద్య, ఉపాధి, మహిళా సాధికారతకు చేయూతగా 'సేవా సంబరం'



**హనుమకొండ, ఆగస్టు 20 ::** లయన్స్ జిల్లా 320ఎఫ్ జిల్లా క్యాబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని "సేవా సంబరం" పేరుతో శనివారం మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి తెలిపారు. మడికొండలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన జిల్లా లయన్స్ క్యాబినెట్ ఈ కార్యక్రమంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించడంతో పాటు, సమాజ సేవకు అంకితభావం, ఉత్సాహం, నూతన సంకల్పంతో పనిచేస్తామని పునరుద్ఘాటించనుందని తెలిపారు. పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై లయన్స్ సేవా కార్యక్రమాల ప్రాధాన్యతపై ప్రసంగించనున్నారు. పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వి.వి. కృష్ణారెడ్డి నూతన జిల్లా క్యాబినెట్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్ భాస్కర్, లయన్స్ ఏరియా లీడర్ దీపక్ భట్టాచార్జీ, అవుల గోపాలరావుతో పాటు పలువురు మల్టిపుల్ డిస్ట్రిక్ట్, జిల్లా స్థాయి లయన్స్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. "సేవా సంబరం"లో భాగంగా పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టనున్నారు. స్థిరమైన జీవనోపాధి అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో అర్హులైన లబ్ధిదారులకు 100 కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నారు. బాలికల విద్యను ప్రోత్సహించడంతో పాటు వారి స్వతంత్ర రాకపోకలకు తోడ్పడే ఉద్దేశంతో 80 మంది బాలికా విద్యార్థులకు సైకిళ్లు అందించనున్నారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు 1,000 స్కూల్ బ్యాగులను పంపిణీ చేయనున్నారు. విద్య, మహిళా సాధికారత, జీవనోపాధి కల్పన, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమానికి లయన్స్ సంస్థ ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా లయన్స్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాలు లబ్ధిదారులకు తక్షణ సహాయం అందించడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1,000 మంది లయన్స్ సభ్యులు "సేవా సంబరం" కార్యక్రమంలో పాల్గొననున్నారు. భారీ సంఖ్యలో లయన్స్ సభ్యుల భాగస్వామ్యం సంస్థలో సమష్టి సేవా స్ఫూర్తిని, సమాజ సంక్షేమం పట్ల వారి అచంచల నిబద్ధతను ప్రతిబింబించనుందని తెలిపారు. ప్రపంచంలోని అతిపెద్ద మానవతా సేవా సంస్థల్లో ఒకటైన లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రపంచవ్యాప్తంగా సుమారు 50,400 క్లబ్‌లు, 14 లక్షల మంది సభ్యులతో 210 దేశాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఆకలి నిర్మూలన, దృష్టి సంరక్షణ, మధుమేహంపై అవగాహన, పర్యావరణ పరిరక్షణ, యువత అభివృద్ధి, క్యాన్సర్ బాధితులకు సహాయం, మానవతా సేవలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి అనేక కీలక రంగాల్లో సేవలందిస్తోంది. లయన్స్ జిల్లా 320ఎఫ్ పరిధిలో వరంగల్, హనుమకొండ, ములుగు, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, కరీంనగర్, సూర్యాపేట, మేడ్చల్ జిల్లాల్లోని 77 లయన్స్ క్లబ్‌ల ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నూతన జిల్లా క్యాబినెట్ జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాల విస్తృతి, పరిధిని మరింత పెంచడమే లక్ష్యంగా పెట్టుకుందని నాయకులు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారికి సకాలంలో తగిన సహాయాన్ని అందిస్తూ "వీ సర్వ్" అనే సేవా స్ఫూర్తితో మరింత మందికి చేరువ కావడానికి లయన్స్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. "సేవే మా లక్ష్యం – సమాజ సేవే మా ధ్యేయం" అనే మార్గదర్శక స్ఫూర్తితో నిర్వహించనున్న "సేవా సంబరం" కార్యక్రమం లయన్స్ సేవా కార్యక్రమాల్లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు, జిల్లాలో సామాజిక సేవకు కొత్త దిశను చూపుతుందని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పుట్ట హరికిషన్ రెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రేపూరి రమణారెడ్డి, జిల్లా చీఫ్ అడ్వైజర్ ముచ్చ రాజిరెడ్డి, జిల్లా నాయకులు పాము శ్రీనివాస్, చొప్పరి సోమయ్య, డాక్టర్ డి. అజిత్ కుమార్, కటంగూరి రామ్‌గోపాల్ రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## చదువు మాత్రమే కాదు.. జీవితాన్ని ఎదుర్కొనే ధైర్యమూ కావాలి

- 'యాంటీ ర్యాగింగ్.. యాంటీ డ్రగ్స్' క్యాంపస్‌గా కాకతీయ విశ్వవిద్యాలయం ఉండాలి
- పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి
- చేతిలో పుస్తకం.. మనసులో ధైర్యం.. ఇదే విద్యార్థి విజయం
- విద్యతో విజ్ఞానం.. విలువలతో వ్యక్తిత్వం.. ధైర్యంతో భవిష్యత్తు



**హనుమకొండ, ఆగస్టు 20 ::** విద్యార్థులు విద్యతో పాటు జీవిత నైపుణ్యాలు, చట్టాలు, సానుకూల ఆలోచనా విధానం, క్రమశిక్షణ, మంచి నడవడికపై అవగాహన పెంపొందించుకోవాలని కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు, అనురాగ్ సొసైటీ చైర్మన్, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయాన్ని 'యాంటీ ర్యాగింగ్.. యాంటీ డ్రగ్స్' క్యాంపస్‌గా నిలబెట్టడంలో ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కాకతీయ విశ్వవిద్యాలయం కో-ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమణ ఆధ్వర్యంలో గురువారం లైఫ్ స్కిల్స్, పాజిటివ్ థింకింగ్, చట్టాలు, యాంటీ ర్యాగింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అనితా రెడ్డి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు కళాశాల కేవలం విద్య, సాంకేతిక నైపుణ్యాలను అందించే వేదిక మాత్రమే కాదని, జీవిత విలువలు, వ్యక్తిత్వ వికాసం, బాధ్యతాయుతమైన ప్రవర్తనను నేర్పించే ప్రదేశంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు తమ సమస్యలను తామే పరిష్కరించుకునే స్థాయికి ఎదగడంతో పాటు, చదువుతో పాటు మంచి నడవడికను అలవర్చుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే దిశగా క్రమశిక్షణతో ముందుకు సాగాలని కోరారు. తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ పరస్పర గౌరవాన్ని పెంపొందించుకోవాలన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే మానసిక స్థైర్యమే నిజమైన జీవిత నైపుణ్యమని డాక్టర్ అనితా రెడ్డి వివరించారు. చిన్నచిన్న సమస్యలకు భయపడి విద్యార్థులు ఆత్మహత్యల వైపు మళ్లకూడదని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తల్లిదండ్రులు, అధ్యాపకులు, కళాశాల అధికారులు లేదా విశ్వసనీయ వ్యక్తులతో చర్చించి పరిష్కారం కనుగొనాలని హితవు పలికారు. ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులపై చట్టపరమైన చర్యలు తప్పవని డాక్టర్ అనితా రెడ్డి హెచ్చరించారు. ఇతరులను మానసికంగా, శారీరకంగా, భావోద్వేగ పరంగా లేదా మరే విధంగానైనా ఇబ్బందులకు గురిచేయడం కూడా ర్యాగింగ్ పరిధిలోకి వస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని కోరారు. అదేవిధంగా ప్రేమ పేరుతో భావోద్వేగాలకు లోనై ఎంతోమంది తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, విద్యార్థులు ఇటువంటి పరిణామాలకు దూరంగా ఉంటూ చదువు, లక్ష్యాలు, భవిష్యత్తుపై దృష్టి కేంద్రీకరించాలని ఆమె పేర్కొన్నారు. ప్రతి కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ, పోష్ (POSH) ఇంటర్నల్ కమిటీలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు, వేధింపులు ఎదుర్కొన్నా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి ఫిర్యాదు చేయాలని, అవసరమైతే తన దృష్టికి కూడా తీసుకురావచ్చని తెలిపారు. "కాకతీయ విశ్వవిద్యాలయం యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ క్యాంపస్‌గా ఆదర్శంగా నిలవాలి. ఇది ఒక్కరి బాధ్యత కాదు.. ప్రతి విద్యార్థి, అధ్యాపకుడు, సిబ్బంది సమష్టి బాధ్యత" అని డాక్టర్ అనితా రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమణ, ప్రొఫెసర్లు కల్పన తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను అధిగమించాలి

**బ్యాంకర్లకు సూచించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**



**వికారాబాద్, ఆగస్టు,20:**బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి బ్యాంకర్లకు సూచించారు.గురు వారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు బ్యాంకర్ల జిల్లా సంప్రదింపుల, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలకు ప్రాధాన్యత కల్పిస్తూ బ్యాంకర్లు ముందుకు సాగాలన్నారు.ప్రతి రంగాల్లో సామాజిక న్యాయం జరిగేలా రుణాలను అందజేయాలని ఆయన బ్యాంకర్లను సూచించారు.2026–27 ఆర్థిక సంవత్సరం సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు క్రాప్ లోన్ రుణాలు అందజేయాలనీ, పంట రుణాలకు సంబందించి రేనివాల్ చేయాలనీ బ్యాంకర్ల కు ఆదేశించారు. జిల్లాలోని మహిళా సంఘాలకు లక్ష్యం మేరకు రుణాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ యాదగిరి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ , నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అఖిల్, బ్యాంకు మేనేజర్లు డిఆర్డిఓ శ్రీనివాస్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవి కుమార్, జిల్లా పశుసంవర్ధక అధికారి సదానందం, ఎస్సీ, బీసీ అధికారులు,జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మహేశ్వర్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## రైతుల కోరిక మేరకు ఖరీఫ్ పంటకు నిజాంసాగర్ నీళ్లు

**నిజాంసాగర్, ఆగస్టు 20:** రైతుల విజ్ఞప్తి మేరకు ఖరీఫ్ పంటలకు సాగునీరు అందించేందుకు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన ఆయన అధికారులతో నీటి నిల్వ వివరాలను సమీక్షించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1400.84 అడుగుల నీటిమట్టంతో 12.284 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. ఆయకట్టు పరిధిలో ఇప్పటికే వరి నాట్లు వేసుకున్న రైతులకు ఇబ్బందులు కలగకుండా ఖరీఫ్ సాగుకు అవసరమైన నీటిని విడుదల చేయనున్నట్లు పోచారం తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. సాగునీటి విడుదలకు నిర్ణయం తీసుకున్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, సిద్దాపూర్ రిజర్వాయర్ రివైజ్ శాంక్షన్‌కు అంగీకారం తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల తరఫున పోచారం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాన్సువాడ, నిజాంసాగర్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

చురకలు



# విగ్రహం కాదు.. మహానేత జ్ఞాపకానికి శాశ్వత గౌరవం కావాలి!

- చిత్తశుద్ధి ఉంటే.. పెద్ది పేరుతో మెడికల్ కాలేజీకి జీఓ ఇవ్వండి
- విగ్రహ రాజకీయాలు కాదు.. మహానేత పేరును చిరస్థాయిగా నిలపాలి... బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణ
- విగ్రహం తొలగింపు వెనుక ఎవరు? బీఆర్ఎస్ సంచలన ప్రశ్నలు



**నర్సంపేట, ఆగస్టు 20 ::** నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీకి స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టాలని, అదే ఆయనకు అందించే నిజమైన నివాళి అని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణ డిమాండ్ చేశారు. నర్సంపేటలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమకు కాంస్య విగ్రహాలపై ఎలాంటి వ్యామోహం లేదని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టాలని అన్నారు. విగ్రహ రాజకీయాలకు బదులుగా మహానేత పేరును చిరస్థాయిగా నిలిపే నిర్ణయం తీసుకోవాలని కోరారు. విగ్రహం తొలగింపుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు దిద్దుబాటు చర్యలకు దిగుతూ తామే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని విమర్శించారు. ఇది కాంగ్రెస్ నాయకుల ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని మెడికల్ కాలేజీ సమీపం నుంచి తొలగించాలని 5వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త పొన్నాల ప్రకాష్ మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఆ ఫిర్యాదు ఆధారంగానే మున్సిపల్ కమిషనర్ పోలీసులకు లేఖ రాశారని, అందుకు సంబంధించిన లేఖ తమ వద్ద ఉందని తెలిపారు. ఒకవైపు కౌన్సిలర్ భర్త విగ్రహాన్ని తొలగించాలని ఫిర్యాదు చేయడం, మరోవైపు కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి దీనితో సంబంధం లేదని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని నాగెల్లి వెంకట నారాయణ విమర్శించారు. అధికారంలో ఉన్నది మీరే.. పేరు పెట్టే అధికారం కూడా మీ చేతుల్లోనే ఉంది. దమ్ము, చిత్తశుద్ధి ఉంటే వెంటనే 'పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీ, నర్సంపేట' పేరుతో ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ) విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విగ్రహం తొలగించే ప్రయత్నాలను విరమించుకుని, పెద్ది సుదర్శన్ రెడ్డి పేరును చిరస్థాయిగా నిలిపే చర్యలు చేపట్టాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియకుండా నర్సంపేటలో వేలాది మంది పోలీసులు గస్తీ కాస్తున్నారా అని ప్రశ్నించారు. విగ్రహం తొలగించాలంటూ ఎమ్మెల్యే నుంచి ఒత్తిడి ఉందని అధికారులు తమతో స్వయంగా చెప్పారని, ఇది కుట్రలో భాగం కాదా అని నిలదీశారు. జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, అభిమానులను హౌస్ అరెస్టులు చేస్తూ నిర్బంధిస్తున్నప్పటికీ ప్రభుత్వం గానీ, స్థానిక ఎమ్మెల్యే గానీ ఎందుకు స్పందించలేదని, ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జన్మదినం రోజునే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించి, పోలీసు నిర్బంధం మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించడం వాస్తవం కాదా అని నిలదీశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం విషయంలో ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తే తమ నాయకత్వాన్ని బెదిరిస్తున్నారని ఆరోపించారు. "ఇదేనా చిత్తశుద్ధి? ఇదేనా సంస్కారం? ఇదేనా ప్రజాస్వామ్యం?" అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, కౌన్సిలర్లు రాయిడి కీర్తి దుశాంత్ రెడ్డి, మండల శ్రీదేవి శ్రీనివాస్, శివరాత్రి స్వామి, దోమ్మటి రమ్య సంతోష్, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు వాసం కరుణ, మాజీ కౌన్సిలర్ నాగిశెట్టి ప్రసాద్, బండి ప్రవీణ్, పెండం వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి రాంప్రసాద్, నాయిని వేణుచంద్, సంపంగి సాలయ్య, మంద ప్రసాద్, పైసా ప్రవీణ్, బైరి నాగరాజు, మోతే తిరుపతిరెడ్డి, బీరం నాగిరెడ్డి, బొల్లెపెల్లి కమల్, పల్నాటి సందీప్, వాసం నాగరాజు, సుందరగిరి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక విద్యకు ఊపిరి..

- 'పాలిటెక్నిక్'ల సమస్యలకు శాశ్వత పరిష్కారం కావాలి
- జీఓ 97పై అపోహలు తొలగించి స్పష్టత ఇవ్వాలి... మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కోరిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హన్మకొండ, ఆగస్టు 20 ::** ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చొరవ తీసుకున్నారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఇ.వి. శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు సమర్పించిన వినతిపత్రాన్ని హైదరాబాద్‌లో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అందజేశారు. పాలిటెక్నిక్‌లకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లకు సంబంధించిన జీఓ 97 విషయంలో విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల్లో నెలకొన్న అపోహలను తొలగించి, పూర్తి స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, విద్యార్థుల భవిష్యత్తును పరిరక్షించడం, కళాశాలల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, అధ్యాపకులు, సిబ్బంది ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకోవాలని నాయిని రాజేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల అభివృద్ధి, సాంకేతిక విద్యను మరింత బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూల దృక్పథంతో స్పందిస్తుందన్న ఆశాభావాన్ని నాయిని రాజేందర్ రెడ్డి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టి, సాంకేతిక విద్యా రంగానికి మరింత బలాన్ని చేకూర్చాలని కోరారు.

# కాజీపేటలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

- చిరకాల డిమాండ్‌కు మళ్లీ ఊపిరి..
- ఎస్‌సీఆర్ జీఎంను కలిసి వినతిపత్రం అందజేసిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య



**వరంగల్, ఆగస్టు 20 ::** కాజీపేట కేంద్రంగా ప్రత్యేక రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే కార్యాలయంలో జనరల్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కాజీపేటకు ఉన్న రైల్వే ప్రాధాన్యత, ప్రత్యేక డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను జీఎంకు వివరించారు. దక్షిణ మధ్య రైల్వేలో అత్యంత కీలకమైన జంక్షన్‌గా కాజీపేటకు ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ, దానికి తగిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని ఎంపీ పేర్కొన్నారు. కాజీపేట కేంద్రంగా ప్రత్యేక రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలన్నది ఈ ప్రాంత ప్రజలు, రైల్వే ఉద్యోగులు, ప్రయాణికులు, రైల్వే వినియోగదారుల దీర్ఘకాల ఆకాంక్ష అని తెలిపారు. ఇటీవల రైల్వే జోన్లు, డివిజన్ల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల నేపథ్యంలో కాజీపేట డివిజన్ అంశాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. కాజీపేటను ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేస్తే పరిపాలనా సామర్థ్యం పెరగడంతో పాటు రైల్వే కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించే అవకాశం ఉంటుందని వివరించారు. కాజీపేట ప్రాంతానికి రైల్వే ఆదాయంలో కీలక వాటా ఉందని డా. కడియం కావ్య తెలిపారు. బల్లార్షా–కాజీపేట, కాజీపేట–విజయవాడ, కాజీపేట–కరీంనగర్, డోర్నకల్–మణుగూరు తదితర మార్గాలు సరుకు రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. బొగ్గు, సిమెంట్, బియ్యం, మిర్చి, గ్రానైట్, ఎరువులు తదితర సరుకుల రవాణాకు ఈ ప్రాంతంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్‌పై పెరుగుతున్న రైల్వే ట్రాఫిక్‌తో పాటు పరిపాలనా భారం కూడా అధికమవుతోందని, ఈ నేపథ్యంలో కాజీపేట కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేస్తే పనిభారం సమతుల్యం కావడంతో పాటు వరంగల్–కాజీపేట ప్రాంత రైల్వే అభివృద్ధికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని ఎంపీ అన్నారు. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్ అని, దీనిపై రైల్వే శాఖ సానుకూలంగా స్పందించాలని ఆమె కోరారు. డివిజన్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని జీఎంను విజ్ఞప్తి చేశారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుతో రైల్వే మౌలిక వసతులు, ప్రయాణికుల సౌకర్యాలు, సరుకు రవాణా మరింత విస్తరించడంతో పాటు వరంగల్–కాజీపేట ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలకు కొత్త ఊపు వస్తుందని డా. కడియం కావ్య ఆశాభావం వ్యక్తం చేశారు.

# పాలిటెక్నిక్ కళాశాలల బంద్ విజయవంతం: ఎస్ఎఫ్ఐ

- శక్తి స్కీమ్‌తో విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం లేదు
- డిప్లమా కోర్సుల డిగ్రేడ్‌ను ఉపసంహరించుకోవాలి
- ఎస్ఎఫ్ఐ బోధన్ కన్వీనర్ వాగ్మరే విశాల్ డిమాండ్

**కోటగిరి, ఆగష్టు 20 :)**భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పిలుపు మేరకు గురువారం నిర్వహించిన కోటగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల బంద్ విజయవంతమైందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ బోధన్ కన్వీనర్ వాగ్మరే విశాల్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ చేపట్టిన బంద్ పిలుపులో భాగంగా కోటగిరిలో కూడా బంద్ పూర్తిస్థాయిలో విజయవంతమైందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' (YISU) పేరిట 'శక్తి' పాలసీని తీసుకువచ్చి, సాంకేతిక విద్యనభ్యసించే డిప్లమా కోర్సులను ఐటిఐ మరియు ఏటీసీ (ATC)లతో అనుసంధానం చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ పేరుతో సాంకేతిక విద్యా మండలి (SBTET) ఉనికిని దెబ్బతీసే కుట్రలను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని హితవు పలికారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానం (NEP) ద్వారా పాలిటెక్నిక్ విద్యార్థులను కేవలం కార్మికులుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని, ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 97 ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్కిల్ యూనివర్సిటీ పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం విచారకరమని, విద్యా రంగాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వమే బాధ్యతల నుండి తప్పుకోవడం తగదని అన్నారు. పాలిటెక్నిక్ కోర్సులను ఇంజనీరింగ్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాల్సింది పోయి, డిగ్రేడ్ చేయడాన్ని ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో పోరాటాలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# పంచాయతీ కార్యదర్శుల సంఘం- నూతన కార్యవర్గం ఏక గ్రీవంగా ఎన్నిక

**కొడంగల్ మున్సిపల్,ఆగస్టు,20:**ఎన్నికల అధికారి బాలకృష్ణారెడ్డి పర్యవేక్షణలో గురువారం కొడంగల్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం–నూతన కార్యవర్గ సంఘం ఎన్నికలు నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షులుగా కె. కొండన్న, ఉపాధ్యక్షులుగా ఏ.కల్పన,కార్యదర్శిగా కె.పరేశ్,కోశాధికారిగా కె.రాజశేఖర్,కార్యవర్గ సభ్యులు పక్రోజి,నక్షత్ర,ఉదయ్ కిరణ్,ఆశప్ప,కృష్ణవేణి–పోచమ్మా తాండ,గౌరవ అధ్యక్షులుగా బుగ్గప్ప,సలహాదారుడుగా జగదీష్ ను ఎన్నుకోవడం జరిగింది.

# తాండూరులో 1260 గ్రాముల గంజాయి స్వాధీనం – ముగ్గురు అరెస్ట్

### జిల్లా ఎస్పీ స్నేహా మేహ్రా ఐపీఎస్ ఆదేశాల మేరకు

**తాండూరు, మున్సిపల్, ఆగస్టు,20:**

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు.ఈ క్రమంలో తాండూరులోని విలియం మూన్ స్కూల్ గ్రౌండ్ వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా బ్యాగులతో తిరుగుతుండటాన్ని పోలీసులు గమనించారు. అనుమానం రావడంతో వారిని అదుపులోకి తీసుకుని వారి బ్యాగులను తనిఖీ చేయగా, వారి వద్ద 1,260 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించారు.దీంతో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై సంబంధిత NDPS Act నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, అరెస్ట్ అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.ఈ తనిఖీలు జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా మరియు వారి బృందం, తాండూర్ టౌన్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు మరియు వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు తెలిపారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# పెట్రోల్ బంకులో చోరీ.. ముగ్గురు నిందితులు అరెస్ట్

- సీఐ విశ్వేశ్వర్ పర్యవేక్షణలో కేసును ఛేదించిన గీసుగొండ పోలీసులు
- రూ.11 వేల నగదు, రెండు చరవాణిలు, ఆటో స్వాధీనం




**గీసుగొండ, ఆగస్టు 20 ::** ఊకల్ గ్రామ శివారులో వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిపై ఉన్న పెట్రోల్ బంకులో చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ పర్యవేక్షణలో పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ₹11 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. సిఐ విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం కాజీపేటకు చెందిన కంది చరణ్, జక్కుల ప్రతాప్, గండికోట శివ ఈ నెల 18వ తేదీ అర్ధరాత్రి ఊకల్ హవేలి గ్రామ శివారులోని భారత్ పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్న మేనేజర్ కొడగాని రాజగోపాల్ ను సీఎన్‌జీ గ్యాస్ పంపు ఎక్కడ ఉందని అడుగుతూ రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మేనేజర్ నిద్రిస్తున్న సమయంలో ఆయన వద్ద ఉన్న బ్యాగులోని ₹15,800 నగదును అపహరించి, ఆటోలో అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం దొంగిలించిన నగదును ముగ్గురూ సమానంగా పంచుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. పెట్రోల్ బంక్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ విశ్వేశ్వర్ ప్రత్యేక క్రైమ్ బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు గురువారం మరియాపురం గ్రామ శివారు కెనాల్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా, అందులో ఉన్న వ్యక్తులు వాహనాన్ని ఆపకుండా పరారయ్యేందుకు యత్నించారు. అప్రమత్తమైన పోలీసులు ఆటోను అదుపులోకి తీసుకుని అందులో ఉన్న ముగ్గురిని పట్టుకున్నారు. వారిని విచారించగా ఊకల్ శివారులోని పెట్రోల్ బంకులో చోరీ చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి దొంగిలించిన నగదులో ₹11 వేల నగదుతో పాటు రెండు మొబైల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. వారి గత నేరచరిత్రను పరిశీలించి సస్పెక్ట్ షీట్లు తెరవనున్నట్లు వెల్లడించారు. కేసును వేగంగా ఛేదించడంలో ప్రత్యేకంగా కృషి చేసిన ఎస్ఐ అనిల్ కుమార్, కానిస్టేబుళ్లు అరవింద్, విజయ్, ప్రవీణ్, సాయిలను సీఐ విశ్వేశ్వర్ అభినందించారు. నిందితులను గుర్తించడం, వారి కదలికలను పసిగట్టడం, వాహన తనిఖీల ద్వారా వారిని అదుపులోకి తీసుకోవడంలో సిబ్బంది చూపిన సమన్వయం, అంకితభావాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.

# పటిష్టమైన పోలీసింగ్ తో ప్రజలకు సత్వర న్యాయం: ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, ఆగస్టు 20:** వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గురువారం బోథ్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. రికార్డులు, కేసు ఫైళ్లు, సీసీటీఎన్ఎస్ పనితీరును తనిఖీ చేసి, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. గంజాయి, పేకాట, గుడుంబా వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని, రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. ప్రజల్లో పోలీసులపై విశ్వాసం, శాఖ ప్రతిష్ఠ పెరిగేలా నిబద్ధతతో విధులు నిర్వహించాలని తెలిపారు. తనిఖీలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, బోథ్ సీఐ డి. గురుస్వామి, ఎస్ఐ వి. పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

చురకలు





# తెలుగు మహిళల హృదయ నేత్రి

# మాలతీ చందూర్

## నేడు మాలతీ చందూర్ వర్ధంతి

ప్రపంచం గర్వించదగ్గ తెలుగు స్త్రీవాద రచయిత్రి మాలతీ చందూర్. చదువు ఎక్కువగా చదువక పోయినా, తెలుగు భాషకు, తెలుగు మహిళకు పట్టాభిషేకం చేసి, సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీతగా గుర్తింపు పొందిన ప్రతిభాశాలి. రచయిత్రిగా, కాలమిస్టుగా, 1950ల నుండి దాదాపు మూడు దశాబ్దాల పాటు తెలుగువారికి ఆమె సుపరిచితం. మాలతీ చందూర్ (1930 - ఆగష్టు 21, 2013) కృష్ణా జిల్లా లోని నూజివీడులో 1930 లో జన్మించారు. ఊర్లో ఉయ్యూరు రాజావారి దివాణం పక్కనే ఎస్ఆర్ఆర్ పాఠశాలలో 8వ తరగతి వరకు ఎస్ఎస్ఆర్ పాఠశాలలోనే చదివారు. 8వ తరగతి పూర్తి కాగానే ఏలూరు వెళ్ళి, అక్కడ వారి మామయ్య (చందూర్) ఇంట్లో ఉండి చదువు కున్నారు. ఏలూరు లోని వల్లూరు సెయింట్ థెరిస్సా స్కూల్లో ఇంగ్లీషు మీడియంలో చేరారు. అప్పుడు చందూర్ గారి ద్వారా డి.కామేశ్వరి, ఆనందా రామం, అరవిందా చారి, సక్కుబాయి వంటి వారితో పరిచయం ఏర్పరుచు కున్నారు. ఏలూరులో వారున్న ఇంటికి దగ్గరగా 'కథావీధి' అనే సాహిత్య పత్రిక ఉండేది. అక్కడికి శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, వెంకటచలం, కావలి లక్ష్మీనరసింగం మొదలైన వారు వచ్చేవారు. 1947లో ఆమె, తన మేన మామ ఎన్. ఆర్. చందూర్ రచయిత, జగతి పత్రిక సంపాదకులు)ను వివాహం చేసుకున్నారు. మద్రాసు చేరుకుని, జార్జిటాన్‌లో అద్దె ఇంటిలో ఉంటూ, మద్రాసులో ప్రైవేటుగా ఎస్ఎస్ఎల్‌సి పూర్తి చేశారు. 1949లో వారి రచనా వ్యాసంగం ప్రారంభించారు. అప్పట్లో రేడియోలో ఆమె రచనలను చదివి వినిపించేవారు. ఆ రోజుల్లో ఎగ్మూర్‌లో ఉన్న రేడియో స్టేషన్‌కు వెళితే ఒక సాహితీ సభకు వెళ్ళిన అనుభూతిని పొందేవారు. అక్కడే ఆచంట జానకిరాం, బుచ్చిబాబు, జనమంచి రామకృష్ణ, పి.వి.రాజమన్నార్, ముని మాణిక్యం నరసింహారావు వంటి వారిని దగ్గరగా గమనించే అవకాశం ఆమెకు కలిగింది. 1952 నుంచి రచనా వ్యాసంగంలో తీరిక లేకుండా గడిపారు. భర్త చందూర్‌ను ఎప్పుడూ "మామయ్య"గానే సంబోధించే మాలతి అన్యోన్య దాంపత్యలో ఆనందాన్ని పొందారు. సంతానం లేని మాలతీ, చందూర్ దంపతులు రచనలే తమ సంతానంగా, సాహితీ ప్రియులే బంధువులుగా గడిపారు. మద్రాసులో తెలుగు సాహితీ సంస్థలకూ, సామాజిక ప్రముఖులకూ పెద్ద దిక్కుగా నిలిచారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్థాపించిన 'ఆంధ్ర మహిళా సభ' నిర్వహణలో, అభివృద్ధిలో దంపతులు ప్రధాన పాత్రలు పోషించారు. 1950లలో 'ఆంధ్రప్రభ' వారపత్రికలో 'ప్రమదావనం' పేరిట స్త్రీల కోసం ప్రత్యేకంగా మాలతీ చందూర్‌తో కాలమ్ ప్రారంభించారు. ప్రమదావనం ద్వారా దశాబ్దాల కాలంగా పాఠకులతో ప్రశ్నలు, జవాబులు శీర్షికను విజయ వంతంగా నడుపుతూ, తెలుగు కాలమిస్టుల చరిత్రలో మాలతీ చందూర్ ఓ అరుదైన ఘనత సాధించారు. ఆ శీర్షికలో వంటలు, వార్పులే కాకుండా ఇంగ్లీషు నవలలను పరిచయం చెయ్యటం, విదేశాలలో తిరిగి వచ్చిన వారి చేత వారి అనుభవాలు రాయించటం మొదలైనవి చేశారు. ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే వారు. ఎప్పుడూ వంటింటికి దూరంగానే గడిపిన మాలతీ చందూర్ రాసిన 'వంటలు - పిండి వంటలు' రచన తెలుగునాట ఎంతో ప్రసిద్ధం. వంటల పుస్తకాలు కొత్తగా పెళ్ళయిన అమ్మాయిలకు ఉపయోగకరంగా ఉండేవి. మాలతీ చందూర్ రాసే "జవాబులు" ఆడవారితో పాటు మగవారు కూడా చదివేవారు. 'జవాబులు' శీర్షిక పేజీలను వారపత్రిక నుండి చించి, పుస్తకాలుగా బైండింగులు చేసి, చాలామంది అపురూపంగా దాచుకొనేవారు. స్వాతి' మాస పత్రిక ప్రారంభ రోజుల నుండి మూడు దశాబ్దాల పైచిలుకుగా 'పాత కెరటాలు' శీర్షిక నిర్వహించారు. చంపకం - చెద పురుగులు' (1955 సెప్టెంబర్ లో ప్రథమ ముద్రణ) తో ప్రారంభించి, దాదాపు 150కి పైగా కథలు ఆమె రాశారు. మహిళా ప్రధాన నవలలు రాయటమే కాక 300 కు పైగా రచనలను తెలుగులోకి అనువదించారు. ఇవి 'పాత కెరటాలు' శీర్షికన స్వాతి మాసపత్రికలో ప్రచురించారు. నవలా రచయిత్రిగా, మహిళా కాలమిస్టుగా అనేక పురస్కారాలు అందుకొన్నది. 70వ దశకములో కేంద్ర సెన్సారు బోర్డు సభ్యురాలిగా పనిచేశారు. అందుకోసం తమిళ తమిళ భాష నేర్చుకుని, రెండేళ్లకే అనువాదాలు ప్రారంభించి, ప్రముఖ తమిళ రచయితలు శివశంకరి, జయకాంతన్, ఎన్.ఎ.పార్థసారథి, పుళమై పిత్తన్, సుజాత, కలైంజర్ కరుణానిధి తదితరులు చేసిన తమిళ రచనలను ఆమె తెలుగులోకి అనువదించారు. భారత స్వాతంత్ర్య సమర కాలంలో జరిగిన ప్రసిద్ధ చీరాల - పేరాల ఉద్యమ నేపథ్యంతో 'వనిత' మాసపత్రికలో ఆమె రాసిన 'హృదయ నేత్రి' నవలకు 1990వ దశకం తొలి రోజుల్లో కలకత్తాలోని 'భారతీయ భాషా పరిషత్' వారి ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డు వరించింది. కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను పొందారు. 2013 ఆగస్టు 21 న చెన్నైలో మాలతీ కన్ను మూసారు. మృతి చెందదానికి ముందు క్యాన్సర్ వ్యాధి గ్రస్తులయ్యారు. మెడికల్ కాలేజీకి ఆమె శరీర దానం చేశారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# నామమాత్రాలైన వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు

## నేడు నేషనల్ సీనియర్ సిటిజన్స్ డే

**కన్నవారు, తాము పెంచి పెద్ద చేసిన తమ వారు, బంధు బాంధవులు, కడదాక తమకు వెన్నంటి ఉంటారని అనుకుని, అశక్తత ఆవహించిన ముదిమి వయసులో, అందరూ వదిలి వేస్తుండగా, ఒంటరితనం భరించడం భయంకరమైన వేళ... విధి వంచితులైన ఎందరో వయోవృద్ధులు, పడుతున్న బాధలు వర్ణనాతీతం. వయో వృద్ధుల సంక్షేమార్థం చేసిన చట్టాలు, వాటి అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కాగితాలకే పరిమితమై, ఆచరణకు నోచుకోలేక మృగ్యాలే అవుతున్నాయి. భారత దేశంలో ప్రస్తుతము 15కోట్లమంది వృద్ధులున్నారు. 2050 నాటికి వీరి సంఖ్య 32.3కోట్లకు చేరుతుందని అంచనా. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని వృద్ధుల సంఖ్య అప్పటికి రెండున్నర కోట్లు దాటే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వయోవృద్ధులు ఉండగా, వీరిలో 10 శాతంకు మించకుండా ఆర్థికంగా, ఆరోగ్యంగా, తమ తమ పిల్లల, బంధువుల వద్ద ఉంటుండగా, మరికొందరు తమ పిల్లలే చేర్పించిన అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో తమ దుస్థితిని తామే తిట్టు కుంటూ, కాలం వెళ్లదీస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ, అనారోగ్యాలకు బలి అవుతూ, నిరాదరణ నీడలో మగ్గుతూ, ఎందరో తమ దుస్థితికి ఆవేదన చెందుతుండటం హృదయ విదారకమై, గుండెలను పిండి వేస్తున్న సచిత్రం సర్వత్రా సాక్షాత్కార మిస్తున్నది.**



దేశంలో నెలకొన్న వరిస్థితుల వల్ల సామాన్యులకు నానాటికీ బతుకు భారము అవుతున్న రోజులివి. అదే క్రమములో వృద్ధుల పట్ల నిరాదరణ కూడా అంతకంతకు ఎక్కువై పోతోంది. దేశాన్ని పాలిస్తోంది ప్రధానంగా వృద్ధనేతలే అయినవ్పటికీ వయోవృద్ధుల సమస్యలకు వరిష్కారం కనబడక పోవడము అసలైన విషాదం. దేశంలోని ప్రతి అయిదుగురి వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేదింపులకు గురవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులే వృద్ధుల పాలిట శత్రువులుగా మారుతున్నారు. దూషణలకు పాల్పడటమే కాకుండా కొందరు శారీరక హింసకూ పాల్పడు తుండటం పతనమవుతున్న మానవతా విలువలకు నిదర్శనం. వాస్తవానికి వృద్ధులు జాతి సంవద! వారి అనుభవాలు ముందు తరాలకు అమూల్యమైన పాఠాలు. అందుకే పాశ్చాత్య దేశాలు వృద్ధుల సంరక్షణకు దీటైన చట్టాలు రూపొందించాయి. బతికినంత కాలం వృద్ధులను కుటుంబ సభ్యులు ఆదరణతో చూసుకునే విధంగా పటిష్ఠ నిబంధనలు చట్టంలో పొందు పరచారు. అనేక దేశాలు చట్టాలు చేసిన 50 ఏళ్ళ తర్వాత, "తల్లిదండ్రుల, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007" మన దేశంలో రూపొందించ బడ్డది. ఐతే దీని గురించి ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించక పోవడం, సదరు చట్టంపై చాలా మందికి అవగాహన లేకపోవడం, సర్వత్రా కనిపిస్తున్నది. ఫలితంగా ఆ చట్టం నిరుపయోగం అవుతున్నది. సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వయోవృద్ధులను, సీనియర్ సిటిజన్లను కుమారులు, కూతురులు విడిచిపెట్టి, పరిత్యాగం చేసే విధంగా, బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా, చట్ట ప్రకారం శిక్షార్హమే. శిక్షాకాలం ఒక టర్మ్‌కు, మూడు మాసాల జైలు శిక్ష లేదా అపరాధ రుసుము, గరిష్టంగా ఐదు వేల రూపాయలు, రెండింటిని విధించవచ్చు. జిల్లాస్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ కు జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్. డి. ఓ. నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని, సీనియర్ సిటిజన్లకు వేరుగా క్యూ పద్ధతి ప్రవేశపెట్టాలని, దీర్ఘకాలిక, అంతిమ పునర్వికాసం లేని రోగాల చికిత్సల సదుపాయాలు, ప్రభుత్వమే కల్పించాలని, 2007 సంక్షేమ చట్టం నిర్దేశిస్తున్నా, అమలుకు నోచుకోక పోవడం శోచనీయం. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం జారీచేసిన వృద్ధుల సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టం పై, సదవగాహన కల్పించడానికి సదస్సులు ఏర్పాటు, ప్రతి జిల్లాలో ఒక వృద్ధాశ్రమం, సీనియర్ సిటిజన్ "డే కేర్" సెంటర్ల నిర్వహణ, ప్రతి మండలంలో వీరి రక్షణ, వైద్య సహాయం కోసం వైద్యశాల, బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా మరిచింది. వయోవృద్ధుల సంక్షేమానికి ఒక డైరెక్టరేటును ఏర్పరచి తగిన నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. జిల్లాలలో సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ లను నెలకొల్పాలి. తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ మరియు సంక్షేమ నియమావళి చట్టం 2011 నిబంధనల మేరకు, జిల్లా కేంద్రాలలో అప్పిలేట్ ట్రిబ్యునళ్ళు, డివిజన్ కేంద్రాలలో ట్రిబ్యునళ్ళు ఏర్పాటు చేసి బాధితుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలి. ఇతర రాష్ట్రాలలో రవాణా సంస్థల బస్సులలో, 30 శాతం రాయితీ ఉండగా, తెలంగాణలో ఇప్పటివరకు లేదు. ఇంటి పన్నులో 30% రాయితీ ఆదాయపు పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వాలి. కళ్ళజోళ్ళు, వినికిడి తదితర పరికరాలు, వీల్ చైర్స్, వాకింగ్ సాధనాలు అందించాలి. వీరి రక్షణ చర్యలు గైకొనాలి. దేవాలయాలలో ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించాలి.



### "సమస్యల పరిష్కారానికి స్వచ్ఛంద సంఘాలు"

జగిత్యాల జిల్లాలో 80 వేల మంది వయో వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి, సౌకర్యాల కల్పనకు, "ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్" ఏర్పాటయింది. విద్యాధికులు, అనుభవైక వైద్యులైన, ఉద్యోగ సంఘాల సీనియర్ నేత హరి అశోక్ కుమార్ అధ్యక్షతన అసోసియేషన్ సమర్థ వంతంగా నిర్వహించ బడుతున్నది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వరదాయిని వరలక్ష్మీ దేవి

**"నమస్తేస్తు మహామాయే, శ్రీపీఠే సుర పూజితే; శంఖ చక్ర గదా హస్తే, మహాలక్ష్మీ క నమోస్తుతే". శంఖ చక్ర గద ధారణియైన మహా లక్ష్మీ దేవి సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి లాంటి అష్టైశ్వర్య ప్రదాయిని. అష్టసంపదలు ఒసంగే జగన్మంగళ దాయిని. అష్టైశ్వర్యాలు కలుగజేసే రూపం వరలక్ష్మిగా ఆరాధనీయం. కొలిచిన వారికి కొంగు బంగారమై వరాలనిచ్చే జగజ్జనని వరలక్ష్మి.**



అన్ని లక్ష్మి పూజల కన్నా, వరలక్ష్మి పూజ ఉన్నతమైనదని శాస్త్ర వచనం. వరలక్ష్మి దేవత విష్ణు మూర్తి భార్య. వైకుంఠ నాథుని జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రంతో కూడిన పౌర్ణమి కల శ్రావణ మాసంలో వరలక్ష్మిని ఆరాధిస్తే, విశేష ఫలమని భావన. ఆయురారోగ్య ఐశ్వర్య సంతోషాదులు లక్ష్మీదేవిని అత్యంత ప్రియమైన శుక్రవారం పూజిస్తేనే కలుగుతాయని శ్రీ సూక్తం వివరిస్తున్నది. వరలక్ష్మిని షోడ శోపచార పూజలతో సేవిస్తే, అష్ట ఐశ్వర్యాలు, అయిదవతనం, సత్సంతానం, సంతానాభివృద్ధి కలకాలం ఉండగలవని శాస్త్ర వచనాలు. సకల కోరికెలు ఈడేరాలని, సర్వమంగళ సంప్రాప్తి కలగాలని, నిత్య సుమంగళిగా వర్ధిల్లాలని ఈ వ్రతాన్ని వివాహితులు వ్రతాన్ని ఆచరిస్తారు. వరాలు యిచ్చే దేవతగా వరలక్ష్మి దేవిని కొలుస్తారు. ఈ పూజలు ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అధికంగా స్త్రీలు కొలుస్తారు. ఈ పండగను ముఖ్యంగా వివాహమైన మహిళలు నిర్వహిస్తారు. శ్రావణ శుక్ల పక్షంలో పౌర్ణమికి ముందు అరు దెంచే శుక్రవారం సువాసినులు వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించడం హిందూ సంప్రదాయం మంచి భర్త, సత్సంతానం కలుగాలని అమ్మాయిలు పూజిస్తారు. ఈ రోజున దేవతను పూజిస్తే అష్టలక్ష్మి పూజలకు సమానం అనే నమ్మకంతో కుటుంబ సభ్యులు కూడా పాలుపంచు కుంటారు. దేవతను పూజిస్తే అష్ట ఐశ్వర్యాలు... సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి లభిస్తాయని ప్రగాఢ విశ్వాసం. కైలాస నాథుడు, పార్వతీదేవికి వరలక్ష్మి వ్రతాచరణ గురించి వివరించినట్లు స్కంద పురాణంలో ఉంది. లోకంలో స్త్రీలు సక లైశ్వర్యాలు, పుత్రపౌత్రాదులను కలిగేందుకు ఏదైనా వ్రతం గురించి తెలపాలని పార్వతీ దేవి, పరమ శివుని కోరగా, వరలక్ష్మి వ్రతాన్ని అభయంకరుడుడైన శంకరుడు వివరించారు. ఈ సందర్భంలోనే భర్తపట్ల ఆదరాన్ని అత్తమామల పట్ల గౌరవాన్ని ప్రదర్శించిన మగధ రాజ్య అంతర్గత కుండిన నగర వాసియైన పరమ సాధ్వి చారుమతి ఉత్తమ ఇల్లాలిగా ప్రవర్తించిన నేపథ్యాన్ని వివరించారు. మహాలక్ష్మిని చారుమతి చిత్తశుద్ధితో పూజించిన క్రమంలో వర లక్ష్మి ఆమెకు స్వప్న సాక్షార్కారమై, శ్రావణ పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం తనను ఆరాధిస్తే, కోరిన వరాల్ని ఒసంగెదనని వరమిచ్చినట్లు కథనం. ముందుగా గణపతిని పూజించి కలశం లోనికి అమ్మవారిని ఆవాహన గురించి షోడశోపచార పూజ, అథాంగ పూజ చేయాలి.

### "సర్వమాంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే

శరణ్యే త్రయంబకే దేవీ నారాయణి నమోస్తుతే"!! అంటూ పూజ చేయాలి. అష్టోత్తర శత నామాల యుక్త దూప, దీప, నివేదన, తాంబూలాలను సమర్పించి, కర్పూర నీరాజనం, మంత్రపుష్పం, మంగళ హారతి సమర్పణ గావించి, తొమ్మిది దారపు పోగులతో తొమ్మిది ముడులను వేసి, మధ్యన పంచ పుష్పాలు కట్టి తోర గ్రంథి చేసి తోర గ్రంధి పూజ, తోర గ్రంధి మంత్ర పఠనం చేయాలి. "లక్ష్మీం క్షీరసముద్ర రాజ తనయాం, శ్రీరంగ ధామేశ్వరీం, దాసీభూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం, శ్రీమన్మంద కటాక్ష లబ్ధ విభవ, బ్రహేంద్ర గంగాధరాం, త్వాం త్రిలోక్య కుటుంబినీం సరసిజాం, వందే ముకుంద ప్రియాం" అని స్తుతించాలి. నవ సూత్ర ధారణను కుడి చేతికి చేయాలి. ఫలభక్ష్య పానీయ పాయసాదులను అమ్మవారికి సమర్పించి, చివరగా వాయన దాన మంత్రంతో ముత్తయిదువను మహాలక్ష్మిగా భావించి, తాంబూలం అందించాలి. భక్తితో వేడుకొంటే వరాలందించే తల్లి వరలక్ష్మి దేవి. వరలక్ష్మి వ్రతం చేసినను, ఈ వ్రతం చేసినప్పుడు చూసినా కూడా సకల సౌభాగ్యాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యైశ్వర్యాలు కలిగుతాయని సూత మహాముని శౌనకాది మహర్షులకు వివరించినట్లు పురాణ కథనం. ఈ వ్రతాన్నిఆచరించడానికి ఏ నిష్ఠలు, నియమాలు, మడులు అవసరం లేదు. నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తం ఉంటే చాలు. వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకరమైంది. ఈ వ్రతాచరణ వల్ల లక్ష్మీదేవి కృప కలిగి సకల శుభాలు కలుగుతాయి. సంపదలంటే కేవలం ధనం మాత్రమేకాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. 'వర' అంటే శ్రేష్ఠమైన అర్థం కూడా ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పతకానికి అడుగు దూరంలో గాయత్రి-ట్రీసా

- జపాన్ జోడీపై వరుస గేమ్ల్లో విజయం
- ప్రపంచ పోటీల్లో క్వార్టర్స్‌కు భారత జోడీ
- 21-16, 21-12తో అదిరిపోయే గెలుపు
- క్వార్టర్స్‌లో చైనా జోడీతో అమీతుమీ
- గెలిస్తే 15 ఏళ్ల తర్వాత చారిత్రక పతకం



**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ జోడీ గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ సత్తా చాటింది. మహిళల డబుల్స్‌లో అద్భుత ఆటతీరుతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో జపాన్‌కు చెందిన రెన్ ఇవానగా-కీ నకనిషి జోడీని 21-16, 21-12 తేడాతో వరుస గేముల్లో చిత్తుచేసింది. దీంతో భారత జోడీ పతకానికి ఒక్క విజయం దూరంలో నిలిచింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 39వ స్థానంలో ఉన్న గాయత్రి-ట్రీసా మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించారు. ట్రీసా శక్తిమంతమైన జంప్ స్మాష్‌లతో జపాన్ జోడీపై ఒత్తిడి పెంచగా, గాయత్రి నెట్ వద్ద చురుగ్గా కదులుతూ పాయింట్లు సాధించారు. ఇద్దరి మధ్య అద్భుత సమన్వయం, కోర్టులో వేగవంతమైన కదలికలతో ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు.

### ఎల్లో కార్డు.. అయినా తగ్గని దూకుడు

మ్యాచ్ మధ్యలో లైన్ కాల్స్ విషయంలో అంపైర్‌తో భారత జోడీకి స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఓ సందర్భంలో షటిల్‌ను ఉద్దేశపూర్వకంగా కొట్టినందుకు ట్రీసాకు ఎల్లో కార్డు చూపించారు. అయినప్పటికీ ఏకాగ్రత కోల్పోకుండా కోచ్ పుల్లెల గోపీచంద్ సూచనలతో ఇద్దరూ తిరిగి ఆటపై దృష్టి పెట్టి విజయాన్ని ఖాయం చేసుకున్నారు.

### చైనాతో అసలు సిసలు పోరు

క్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రీసాకు అసలైన పరీక్ష ఎదురుకానుంది. ప్రపంచ నాలుగో ర్యాంకు చైనా జోడీ జియా యి ఫాన్-జాంగ్ షు షియాన్‌తో తలపడనున్నారు. ఇప్పటివరకు ఈ జోడీతో మూడుసార్లు తలపడిన భారత ద్వయం ఒక్కసారి కూడా విజయం సాధించలేదు. అయితే ప్రస్తుతం ఉన్న జోరును కొనసాగించి చైనా జోడీని ఓడిస్తే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు పతకం ఖాయం కానుంది. భారత మహిళల డబుల్స్‌లో చివరిసారిగా 2011లో జ్వాలా గుత్తా-అశ్విని పొన్నప్ప ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించారు. శుక్రవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రీసా విజయం సాధిస్తే 15 ఏళ్ల తర్వాత ఆ ఘనతను అందుకోవడంతో పాటు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన రెండో భారత మహిళల డబుల్స్ జోడీగా చరిత్ర సృష్టించనున్నారు.



# సింధు ముందుకు.. సేన్ ఇంటికి

**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు, యువ సంచలనం ఆయుష్ శెట్టి ప్రిక్వార్టర్స్ చేరగా.. టైటిల్ ఫేవరెట్ లక్ష్య సేన్ రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో 9వ సీడ్ సింధు 21-16, 21-17తో కెనడాకు చెందిన వెన్ యు జాంగ్‌పై వరుస గేమ్స్‌లో విజయం సాధించింది. ప్రిక్వార్టర్స్‌లో తను చైనా స్టార్, మూడో సీడ్ వాంగ్ జి యితో అమీతుమీ తేల్చుకోనుంది. తొలిసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆడుతున్న యువ షట్లర్ ఉన్నతి హుడా 21-11, 9-21, 21-23తో 12వ సీడ్ మిచెల్ లీ (కెనడా) చేతిలో పోరాడి ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో లక్ష్యకు అమెరికా షట్లర్ గారెట్ టాన్ షాకిచ్చాడు. 67 నిమిషాల పాటు సాగిన పోరులో లక్ష్య 21-19, 19-21, 17-21తో ఓటమి పాలయ్యాడు. ఇక పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో గాయం కారణంగా ప్రత్యర్థులు వాకోవర్ ఇవ్వడంతో భారత స్టార్ జోడీ సాత్విక్- చిరాగ్ శెట్టి నేరుగా ప్రిక్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది. మరోమ్యాచ్‌లో హరిహరన్-ఎంఆర్ అర్జున్ 17-21, 14-21తో కాంగ్ మిన్ హ్యుక్ - కీ డాంగ్ జూ (కొరియా) చేతిలో ఓడగా.. మిక్స్‌డ్ లో తనీషా క్రాస్టో- ధ్రువ్ కపిల 21-11, 21-11తో లియాంగ్ చోంగ్-వెంగ్ చీ (మకావు)పై నెగ్గి ప్రిక్వార్టర్స్ చేరింది.

# లంకకు ట్రిపుల్ షాక్..

## భారత్‌కు విజయం మరింత ఈజీ!

- రెండో టెస్టుకు ముగ్గురు కీలక ఆటగాళ్లు దూరం
- చండిమాల్, మెండిస్, నిస్సాంకకు గాయాలు
- తొలి టెస్టులో 165 పరుగులతో భారత్ ఘనవిజయం
- ఆగస్టు 23 నుంచి కొలంబోలో రెండో సమరం
- యువ ఆటగాళ్లకు ఇదే అవకాశమన్న కిర్‌స్టెన్



**కొలంబో:** తొలి టెస్టులో భారత్ చేతిలో భారీ ఓటమి ఎదుర్కొన్న శ్రీలంకకు రెండో టెస్టుకు ముందు వరుస షాక్‌లు తగిలాయి. కీలక ఆటగాళ్లు దినేష్ చండిమాల్, కుశాల్ మెండిస్, పాథుమ్ నిస్సాంక గాయాల కారణంగా రెండో టెస్టుకు దూరం కానున్నారు. ఇప్పటికే గాలెలో జరిగిన తొలి టెస్టులో 165 పరుగుల తేడాతో ఓడిన లంకకు ముగ్గురు ప్రధాన ఆటగాళ్లు అందుబాటులో లేకపోవడం పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఆగస్టు 23 నుంచి కొలంబో వేదికగా రెండో టెస్టు జరగనుంది. కుశాల్ మెండిస్ హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో బాధపడుతున్నాడని శ్రీలంక ప్రధాన కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ వెల్లడించారు. గాయం తీవ్రత కారణంగా కొన్ని రోజుల పాటు అతడు జట్టుకు అందుబాటులో ఉండడని తెలిపారు. ఓపెనర్ పాథుమ్ నిస్సాంక కూడా తొడ కండరాల గాయంతో రెండో టెస్టుకు దూరమయ్యాడు.

### చండిమాల్‌కూ విశ్రాంతి

తొలి టెస్టులో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో దినేష్ చండిమాల్ గాయపడ్డాడు. తల, మెడ భాగంలో గాయం కావడంతో మైదానంలోనే అస్వస్థతకు గురైన అతడిని ఆస్పత్రికి తరలించారు. అతడి స్థానంలో పాసిందూ సూర్యబండార కంకషన్ ప్రత్యామ్నాయ ఆటగాడిగా బరిలోకి దిగాడు. వైద్యుల సూచనల మేరకు చండిమాల్‌ను రెండో టెస్టు నుంచి తప్పించినట్లు శ్రీలంక జట్టు వర్గాలు తెలిపాయి.

### యువ ఆటగాళ్లకు పరీక్ష

ముగ్గురు సీనియర్ ఆటగాళ్లు దూరం కావడం యువ క్రికెటర్లకు తమ సత్తా నిరూపించుకునే అవకాశమని కిర్‌స్టెన్ అభిప్రాయపడ్డారు. దేశవాళీ క్రికెట్‌లో మంచి ప్రదర్శన చేసిన ఆటగాళ్లకు జాతీయ జట్టులో అవకాశాలు లభిస్తాయని చెప్పారు. శ్రీలంకలో ప్రతిభకు కొదవలేదని, అయితే టెస్టు క్రికెట్‌లో మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. గాలె టెస్టులో 99 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయినా మ్యాచ్‌ను ఐదో రోజు వరకు తీసుకెళ్లడం జట్టు పోరాట పటిమకు నిదర్శనమన్నారు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ టాప్ ఆర్డర్ విఫలం కావడమే ఓటమికి ప్రధాన కారణమని విశ్లేషించారు. యువ బ్యాటర్ సోనల్ దినూష తొలి ఇన్నింగ్స్‌లో 100, రెండో ఇన్నింగ్స్‌లో 84 పరుగులతో ఆకట్టుకున్నాడని ప్రశంసించారు. తొలి టెస్టు విజయంతో ఇప్పటికే ఉత్సాహంగా ఉన్న భారత్‌కు.. శ్రీలంక కీలక ఆటగాళ్లు ముగ్గురు దూరం కావడం మరింత కలిసొచ్చే అంశం. దీంతో కొలంబో టెస్టులోనూ భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది.



# అగ్రస్థానంలోకి ప్రజ్ఞానంద

**సెయింట్ లూయిస్ :** సింక్‌ఫీల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద టైటిల్‌కు చేరువయ్యాడు. బుధవారం జరిగిన ఎనిమిదోరౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమ్ వాచియర్ లాగ్రెవ్‌ను ఓడించిన ప్రజ్ఞా.. అమెరికా జీఎం వెస్లీ సోతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానానికి చేరుకున్నాడు. నల్లపావులతో ఆడిన ప్రజ్ఞా తెలివైన వ్యూహంతో 28 ఎత్తుల్లోనే ప్రత్యర్థి ఆట కట్టించాడు. ఈ విజయంతో 5 పాయింట్లు సాధించిన భారత గ్రాండ్ మాస్టర్ ఈ ఏడాది చివర్లో జరిగే ఫైనల్ బెర్తు ఖాయం చేసుకున్నాడు. ఆఖరి రౌండ్‌లో ప్రజ్ఞానంద తెల్ల పావులతో నెదర్లాండ్స్‌కు చెందిన అనీష్ గిరితో తలపడనున్నాడు.

# పాకిస్థాన్‌ను చిత్తు చేసిన భారత్

**హాకీ వరల్డ్ కప్‌లో టాప్-8కి దూసుకెళ్లిన టీమిండియా**



**అమ్స్టెల్వీన్:** నెదర్లాండ్స్‌లోని అమ్స్టెల్వీన్ వేదికగా జరుగుతున్న హాకీ వరల్డ్ కప్ 2026 పూల్-డీ మ్యాచ్‌లో భారత పురుషుల హాకీ జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో ఉత్కంఠభరితంగా సాగిన పోరులో భారత్ 5-3 తేడాతో ఘన విజయం సాధించి టోర్నీలో టాప్-8 స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఇంగ్లండ్ చేతిలో ఎదురైన పరాజయం తర్వాత అద్భుతంగా పుంజుకున్న భారత జట్టు, ప్రపంచకప్‌లో తమ అవకాశాలను సజీవంగా ఉంచుకుంటూ ఈ కీలక విజయాన్ని అందుకుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత జట్టు మ్యాచ్ ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మ్యాచ్ 20వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌గా మలిచి జట్టుకు 3-0 ఆధిక్యాన్ని అందించాడు. వెంటనే 21వ నిమిషంలో పాకిస్థాన్ ఆటగాడు షాహిద్ హన్నన్ గోల్ చేయడంతో స్కోరు 3-1 అయింది. అయితే 23వ నిమిషంలో భారత ఆటగాడు అభిషేక్ మెరుపు గోల్‌తో స్పందించి స్కోరును 4-1కి తీసుకెళ్లాడు. తర్వాతి నిమిషంలోనే పాకిస్థాన్ తరఫున సుఫ్యాన్ ఖాన్ మరో గోల్ చేయడంతో తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత్ 4-2 ఆధిక్యంలో నిలిచింది. మూడో క్వార్టర్‌లోనూ భారత్ తన దూకుడును కొనసాగించింది. లభించిన పెనాల్టీ అవకాశాన్ని హార్దిక్ సింగ్ సమర్థవంతంగా గోల్‌గా మలచడంతో భారత్ 5-2 ఆధిక్యంలోకి వెళ్లింది. చివరి క్వార్టర్ 45వ నిమిషంలో పాకిస్థాన్ ప్లేయర్ షాహిద్ హన్నన్ తన రెండో గోల్ సాధించి స్కోరును 5-3కి తీసుకొచ్చినా, చివరి నిమిషాల్లో భారత డిఫెన్స్ అత్యంత పటిష్టంగా వ్యవహరించింది. ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను నియంత్రించి 5-3తో చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (2 గోల్స్), అభిషేక్ (2 గోల్స్), హార్దిక్ సింగ్ (1 గోల్) రాణించడంతో భారత్ ప్రపంచకప్ తదుపరి దశకు సముచిత రీతిలో అడుగుపెట్టింది.



# సుహాస్ ప్రీతమ్‌కు స్వర్ణం

**హైదరాబాద్:** జూనియర్ నేషనల్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్లు 4 పతకాలు సాధించారు. భువనేశ్వర్‌లో బుధవారం జరిగిన బాయ్స్ 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో చెందిన సుహాస్ ప్రీతమ్ స్వర్ణం నెగ్గాడు. ఫైనల్ రేసును 57.33 సెకండ్ల కెరీర్ బెస్ట్ టైమింగ్‌తో ముగించి అగ్రస్థానం సొంతం చేసుకున్నాడు. శ్రీనిత్య సాగి బాలికల 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లే విభాగంలో 5 నిమిషాల 19.15 సెకండ్లతో రజతం, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ రేసులో (1:08.37 ని) కాంస్యం గెలిచింది. అనికా దెబోరా బాలికల 50 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో (28.02 సె) మూడో స్థానంతో కాంస్యం ఖాతాలో వేసుకుంది.




# 90 ఏళ్ల ఘనమైన నట వారసత్వం మాది

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్ తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. ఈ సందర్భంగా నాగార్జునతో పాటు అతడి కుమారులు వారి సినీ ప్రయాణం, కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అక్కినేని కుటుంబం నుంచి తొమ్మిది దశాబ్దాల సినిమా చరిత్ర కొనసాగుతుండటం పట్ల టాలీవుడ్ కింగ్ నాగార్జున సంతోషం వ్యక్తం చేశారు. లెగసీ అంటే కేవలం నటులుగా ఉండటం కాదని, మొత్తం సినిమా రంగానికే సేవ చేయడమని ఆయన స్పష్టం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు అడుగుజాడల్లో తాను ప్రయాణించానని, ఇప్పుడు తన కుమారులు నాగచైతన్య, అఖిల్ కూడా అదే బాటలో నడుస్తున్నారని తెలిపారు. సృజనాత్మక రంగంలో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో చెబుతూ, షూటింగ్ సెట్స్‌లో ఎవరికోసం ఎప్పుడూ ఇబ్బంది కలిగించకూడదనే తన సిద్ధాంతాన్ని గుర్తుచేసుకున్నారు. 'శివ', 'గీతాంజలి' వంటి సాహసోపేతమైన చిత్రాలతో తాను ఎలా కొత్త మార్గాన్ని ఎంచుకున్నానో, అదే రీతిలో కుమారులు కూడా సొంత గుర్తింపు తెచ్చుకోవాలని నాగార్జున ఆకాంక్షించారు. నాగచైతన్య మాట్లాడుతూ.. దాదాపు 90 ఏళ్ల సినిమా ప్రయాణం కాలాతీతమైనదని, తాత నాగేశ్వరరావు, తండ్రి నాగార్జునల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చైతూ తెలిపారు. సినిమా పరిశ్రమలోకి వచ్చిన మొదట్లో తనకంటూ ఒక స్టైల్ వెతుక్కునే క్రమంలో ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నానని, అయితే కాలక్రమేణా సినిమాపై ఉన్న ఇష్టంతో ఆ సవాళ్లను అధిగమించానని చెప్పారు. అక్కినేని కుటుంబం అందించిన లెగసీని కాపాడుకోవడం తమ బాధ్యత అని యంగ్ హీరో అఖిల్ అక్కినేని పేర్కొన్నారు. తమ కుటుంబం నుంచి వచ్చిన వారసత్వాన్ని 'బంగారు బ్యాటన్'తో పోల్చిన ఆయన, దానిని మరింత ముందుకు తీసుకువెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. తాత ఇచ్చిన వారసత్వాన్ని ఎప్పటికీ గుండెల్లో దాచుకుంటామని అఖిల్ భావోద్వేగంగా పంచుకున్నారు.

# పూజా హెగ్డేకు అరుదైన గౌరవం

## న్యూయార్క్‌లో ప్రత్యేక సత్కారం

## అంతర్జాతీయ వేదికపై మెరిసిన నటి

తెలుగు చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయిక పూజా హెగ్డేకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. న్యూయార్క్‌లో జరిగిన ప్రత్యేక గాలా కార్యక్రమంలో ఆమెను సత్కరించారు. ఈ గౌరవంపై ఉప్పొంగిపోయిన పూజా హెగ్డే సామాజిక మాధ్యమాల వేదికగా తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. న్యూయార్క్‌లో నిర్వహించిన గాలా కార్యక్రమానికి హాజరైన పూజా హెగ్డేకు అక్కడ ప్రత్యేక సత్కారం లభించింది. తనను గౌరవించిన న్యూయార్క్ నగర పబ్లిక్ అడ్వకేట్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై దక్కిన ఈ గుర్తింపు తనకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

### 'ఇది ఆరంభం మాత్రమే'

"ఈ గౌరవం నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. నన్ను సత్కరించిన న్యూయార్క్ నగర పబ్లిక్ అడ్వకేట్‌కు, నిర్వాహకులకు కృతజ్ఞతలు. ఇంతటి ప్రేమను అందుకున్న తర్వాత మళ్లీ పని బాట పట్టేందుకు సిద్ధంగా ఉన్నాను. ఇది ఆరంభం మాత్రమే.. ముున్ముందు ఇంకా చాలా ఉంది" అంటూ పూజా హెగ్డే తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. దక్షిణాది చిత్రసీమలో పలువురు అగ్ర కథానాయకుల సరసన నటించి అగ్ర కథానాయికగా గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే ఇటీవల 'జన నాయకుడు' చిత్రంలో కథానాయికగా మెరిశారు. ప్రస్తుతం ఆమె 'కాంచన 4', 'శ్రీ శ్రీ' చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాలు ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్నాయి. అంతర్జాతీయ వేదికపై తాజాగా లభించిన సత్కారంతో పూజా మరోసారి వార్తల్లో నిలిచారు.



# మ్యూజికల్ డ్రామా జగమే సంగీతం




## అమెజాన్‌లో 4నుంచి వెబ్ సిరీస్

టాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన మ్యూజికల్ డ్రామా సిరీస్ 'జగమే సంగీతం' ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ ప్రపంచవ్యాప్త ప్రీమియర్ తేదీని అధికారికంగా ప్రకటించింది. కర్ణాటక సంగీత నేపథ్యంతో రూపొందిన ఈ ఒరిజినల్ సిరీస్ సెప్టెంబర్ 4 నుంచి ప్రసారం కానుంది. ప్రముఖ హిందీ సిరీస్ 'బందిష్ బాండిట్స్' స్ఫూర్తితో తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్‌ను పల్నాటి సూర్య ప్రతాప్ సృష్టించి దర్శకత్వం వహించగా, సుష్మిత కొణిదెల నిర్మించారు. ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, మధుబాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ లగుసాని, సుస్మితా శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వంగాల సూర్య మనోజ్, శ్రావణి సముద్రాల, ఎ.ఆర్. ప్రభావ్ ఈ సిరీస్‌కు కథను అందించగా, విశాల్ చంద్రశేఖర్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. కర్ణాటక సంగీత సంప్రదాయాలను సమకాలీన శ్రుతులతో మేళవిస్తూ ఆయన అందించిన స్వరాలు ఈ కథకు ప్రాణం పోశాయని చెప్పవచ్చు. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో తెలుగుతో పాటు తమిళ డబ్బింగ్ వెర్షన్, ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో ప్రైమ్ వీడియోలో ఈ సిరీస్ అందుబాటులోకి రానుంది. ఈ కథ విషయానికొస్తే.. కర్ణాటక సంగీత వారసత్వాన్ని కలిగిన కుటుంబం మరియు దాని మూలాల చుట్టూ ఈ సిరీస్ తిరుగుతుంది. తన తాత గారి సంగీత వారసత్వాన్ని కొనసాగించాలనుకునే బాలు అనే యువకుడు.. కుటుంబ బంధాలు, రహస్యాలు, సాంప్రదాయ కట్టుబాట్ల మధ్య ఎలా నలిగిపోయాడనేదే ప్రధానాంశం. తన కుటుంబం నిర్మించిన ప్రతిష్టను కాపాడుకుంటూనే, తనకంటూ ప్రత్యేకమైన కళాత్మక స్వరాన్ని ఎలా కనుగొన్నాడనే భావోద్వేగ ప్రయాణాన్ని ఇందులో చూపించనున్నారు. సంగీతంలోని భావోద్వేగ శక్తిని చాటిచెప్పే హృద్యమైన కథే 'జగమే సంగీతం' అని, సంప్రదాయం, ఆశయం వంటి అంశాలను ఇది అద్భుతంగా అన్వేషిస్తుందని తెలిపారు. అలాగే నిర్మాత సుష్మిత కొణిదెల మాట్లాడుతూ.. సంగీతం కేవలం ఒక కళ మాత్రమే కాకుండా, ఆ కుటుంబంలోని ప్రేమ, సంఘర్షణలను తెలిపే భావోద్వేగ భాషగా ఎలా మారుతుందో ఈ సిరీస్ ద్వారా చూపిస్తున్నామని పేర్కొన్నారు. అసాధారణ నటీనటులతో తెరకెక్కిన ఈ సంగీత భరిత ప్రయాణాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆస్వాదిస్తారని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

# మరో మూవీతో మమితా బైజు సిద్ధం

'ఇప్పుడెందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసి కుర్రకారుని ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ఇప్పుడీ జోష్‌లోనే మరో ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీగా ఉంది. ఆమె, నివిన్ పౌలీ జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా మరో పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది మమిత. అందులో ఆమె కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతాన్ నిర్మించిన ఈ రొమాంటిక్ ప్రేమకథా చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.



## రంభ ఊర్వశి మేనక నుంచి మరో పాట విడుదల

'రంభ ఊర్వశి మేనక' అంటూ అల్లరి చేయడానికి సిద్ధమయ్యారు అల్లరి నరేశ్. ఆయన ప్రధానపాత్రలో తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇందులోని రెండో పాటను విడుదల చేశారు. 'బ్యాడ్ టైమ్ బ్యాండ్ బాజా' అంటూ సాగే ఈ పాటలో వెళ్లవే పేదరికం.. ఇక్కడే ఇల్లరికం అనే లిరిక్స్ నేపథ్యానికి తగినట్లుగా ఉన్నాయి. చంద్రమోహన్ చింతా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నరేశ్‌కు జోడీగా సురభి నటించారు.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com